RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 98 ఆదివారం 4 మే 2025 పేజీలు : 4

### నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌లకు నోటీసులు

న్యూఢిల్లీ : నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఇక్కడి ప్రత్యేక కోర్టు నోటీసులు పంపించింది. నేషనల్ హెరాల్డ్‌కు చెందిన స్థిరాస్తుల బదలాయింపులో మనీలాండరింగ్ జరిగిందని ఆరోపిస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వారిపై కేసు నమోదు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన ప్రత్యేక జడ్జి విశాల్ గోగ్నే...నిందితులకు వాదన వినిపించే హక్కు ఉందని పేర్కొంటూ నోటీసులు జారీ చేశారు. ఏ దశలోనయినా వినిపించే హక్కు కలిగించడం న్యాయమైన విచారణకు ఊపిరిపోస్తుందని వ్యాఖ్యానించారు. తదుపరి విచారణను ఈ నెల ఎనిమిదో తేదీకి వాయుదా వేశారు. మూతపడిన నేషనల్ హెరాల్డ్ పత్రిక ఆస్తుల బదలాయింపులో కాంగ్రెస్ నాయకులు క్రిమినల్ కుట్రకు, ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ బీజేపీ నాయకుడు సుబ్రహ్మణ్యస్వామి 2014లో ప్రయివేటు క్రిమినల్ కంప్లయింట్ దాఖలు చేశారు. 2021 నుంచి ఈడీ దీనిపై దర్యాప్తు చేస్తోంది.

# రేషన్ కార్డుదారులకు రేవంత్ సర్కార్ గుడ్ న్యూస్!

## పెండింగ్ దరఖాస్తులకు లైన్ క్లియర్!!




హైదరాబాద్: రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న వారికి తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎన్ని ఏళ్ల నుంచి రేషన్ కార్డుల కోసం చేస్తున్న నిరీక్షణకు మోక్షం లభించనుంది. మీ పాత రేషన్ కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చే ప్రక్రియ మొదలైంది. ఇప్పటివరకూ రేషన్ కార్డుల్లో అవసరం లేని సభ్యులను తొలగించడం కొసాగుతుండగా, తాజాగా కొత్త సభ్యులను చేర్చేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాంతో తెలంగాణ పౌరసరఫరాల శాఖ రేషన్ కార్డుల్లో కొత్త సభ్యుల చేరిక కోసం దరఖాస్తులను పరిశీలించి ఆమోదిస్తోంది.

**మే నెల కోటా కేటాయింపు...** ఇప్పటివరకు రేషన్ కార్డులలో సభ్యులు తొలగింపు కొనసాగుతుండగా, తాజాగా కొత్త సభ్యుల చేరిక ఆప్షన్‌కు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాంతో దరఖాస్తులు పరిశీలించి కొత్త సభ్యులను అధికారులు ఆమోదిస్తున్నారు.

కొత్త రేషన్ కార్డులు జారీ అయినప్పటికీ, ఏడేళ్ల వయసు దాటిన వారికి మాత్రమే రేషన్ సరుకులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. పెండింగ్ దరఖాస్తులు 20 శాతం మేర పరిష్కరించి వాటికి సైతం మే నెల రేషన్ కోటాను పౌరసరఫరాల శాఖ కేటాయించింది. మిగతా దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా పరిశీలించి ఒక్కొక్కటిగా ఆమోదిస్తోంది.

**రేషన్ కార్డులు లేక తీవ్ర ఇబ్బందులు, త్వరలోనే పరిష్కారం...** తెలంగాణలో 2 కోట్ల 81 లక్షల కుటుంబాలకు దాదాపు 90 లక్షల మేర రేషన్ కార్డులున్నాయి. కానీ రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా కొత్త రేషన్ కార్డులు జారీ చేయకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో, అటు ప్రైవేట్ ఆస్పత్రిలో నూ ఈ కార్డులు లేక ఉచిత వైద్యం సైతం చేయించుకోలేకపో తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రేషన్ కార్డులపై కదలిక వచ్చింది. రేషన్ కార్డులు జారీలో జాతీయ జరుగుతున్న, దరఖాస్తుల పరిశీలన కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే రేషన్ కార్డులో కొత్త సభ్యుల చివరి కోసం దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయి. ఉమ్మడి కుటుంబాలు వేరై రెండు మూడు కుటుంబాలుగా విడిపోయిన, కుటుంబంలో కొత్త వ్యక్తి పుట్టినా ప్రత్యేకంగా రేషన్ కార్డులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ...** రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెబుతున్నప్పటికీ తమకి ఇంకా రేషన్ కార్డులు జారీ కావడం లేదని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా పాలనలో భాగంగా తీసుకున్న దరఖాస్తులు, జనవరి నెలలో గ్రామసభలో వచ్చిన దరఖాస్తులు, ఆపై మీసేవ కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తులను పౌరసరఫరాల శాఖ పరిశీలించి ఆమోదిస్తోంది. కొందరు ఒకే రేషన్ కార్డు కోసం మూడు నాలుగు దరఖాస్తులు ఇచ్చినట్లుగా అధికారులు తెలిపారు. అందువల్లే రేషన్ కార్డులు జారీలో జాప్యం జరుగుతోందని చెబుతున్నారు. ఇటీవల ఆమోదం పొందిన రేషన్ కార్డులకు మే నెల కోటా కేటాయించినట్లు అధికారులు తెలిపారు. మధ్యలో ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంతో ఎన్నికల కోడ్ కారణంగా రేషన్ కార్డుల జారీలో జాప్యం జరుగుతోందని నేతలు చెబుతున్నారు. కానీ ఏడాదిన్నర గడిచినా కొత్త రేషన్ కార్డులు తమ చేతికి మాత్రం రాలేదని ప్రజలు అంటున్నారు. రేషన్ కార్డులను రెండు రకాలుగా జారీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని తెలిసిందే.

## ప్రజలకు వేగంగా న్యాయం చేసి.. వారి అభిమానాన్ని పొందాలి: తెలంగాణ డీజీపీ



హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు వేగంగా న్యాయం చేసి వారి అభిమానాన్ని పొందాలని ఇన్‌స్పెక్టర్లకు డీజీపీ జితేందర్ సూచించారు. పోలీస్ స్టేషన్లకు ప్రజలు వచ్చినప్పుడు వారికి న్యాయం జరిగేలా చూడాలని.. తద్వారా వారికి మిత్రులుగా మారుతారని అన్నారు. ప్రజలకు న్యాయం చేసినప్పుడు పోలీస్ అధికారులు మంచి పేరు తెచ్చుకోవడంతో పాటు ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని వివరించారు. పోలీసులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తే చెడ్డ పేరు కూడా వస్తుందనే విషయాన్ని పోలీసులు గుర్తుపెట్టుకోవాలన్నారు. రాష్ట్రంలోని అన్ని యూనిట్ల నుంచి వచ్చిన ఇన్‌స్పెక్టర్లతో డీజీపీ సమావేశమయ్యారు.

"రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించనుంది. స్టేషన్ హౌస్ ఆఫీసర్లు తమ తమ ప్రాంతాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ పోలీసులు తమ శక్తి సామర్థ్యాలను చాటుకునే అవకాశం వచ్చింది. అందుకు అనుగుణంగా కృషి చేయాలి.

పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావడంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ల పాత్ర ఎంతో కీలకం. దేశంలోనే ఉత్తమ పోలీస్ శాఖగా ఎంపికైన తెలంగాణలో పనిచేస్తున్న సిబ్బంది ఆ స్థాయిని నిలుపుకోవాలి. సాధించింది కొంత మాత్రమే.. చేయాల్సింది ఇంకా ఎంతో ఉంది అనేలా పోలీసులు పనిచేయాలి" అని డీజీపీ సూచించారు.

## ధాన్యం దిగుబడిలో దేశంలోనే తెలంగాణ టాప్: మంత్రి ఉత్తమ్



హనుమకొండ: ధాన్యం దిగుబడిలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న సానుకూల వైఖరికి ధాన్యం దిగుబడే నిదర్శమని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నీటిపారుదల, పౌరసరఫరాల శాఖలపై హనుమకొండ కలెక్టరేట్‌లో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీని చరిత్రాత్మక అంశంగా పేర్కొన్నారు. సన్న బియ్యం పంపిణీకి మించిన సంక్షేమ పథకం మరొకటి లేదన్నారు. అర్హులైన పేదలందరికీ ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేయాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక నీటిపారుదల శాఖను ప్రక్షాళన చేస్తున్నట్లు తెలిపారు. ఈ శాఖలోని అన్ని సమస్యలను రెండేళ్లలో అధిగమిస్తామన్నారు. సీతమ్మసాగర్‌కు 68 టీఎం సీల గోదావరి జలాలు కేటాయించామన్నారు. కేంద్రంతో అనేక సార్లు చర్చించి నీటి వాటాను దక్కించుకున్నట్లు ఉత్తమ్ తెలిపారు.




# సరిహద్దుల్లో టెన్షన్ టెన్షన్..

## యుద్ధ భయంతో వణికిపోతున్న పాకిస్తాన్..

## పీవోకేలో ప్రజలకు కీలక ఆదేశాలు!

పహల్గాం ఉగ్రదాడి తరువాత పాకిస్థాన్, భారత్ దేశాల మధ్య ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఇరు దేశాలు సరిహద్దుల్లో బలగాలను మోహరిస్తున్నాయి. దీంతో నియంత్రణ రేఖ వెంబడి టెన్షన్ వాతావరణం నెలకొంది. యుద్ధ వాతావరణంతో ఇరువైపులా ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. భయం గుప్పిట కశ్మీరీలు కాలం వెళ్లదీస్తున్నారు. ఏ క్షణమైనా యుద్ధం జరగొచ్చనే భయంతో ఇరువైపులా బంకర్లు సిద్ధం చేసుకుంటున్నారు. అటు అవసరమైన సామాగ్రిని ముందుగానే అందుబాటులో ఉంచుకుంటున్నారు. పీవోకేలో ప్రజలకు పాక్ అధికారులు కీలక ఆదేశాలు జారీ చేశారు. రెండు నెలలకు సరిపడా ఆహార నిల్వలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం యుద్ధం వాతావరణంతో ప్రజలు తమ ఇండ్లలో బంకర్లు నిర్మించుకుంటున్నారు. కాల్పులు జరిగినప్పుడు బంకర్లలో తలదాచుకునేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీంతోపాటు పహల్గాం ఉగ్రదాడి తరువాత పాకిస్థాన్ సైన్యం నియంత్రణ రేఖ వెంబడి భారీగా బలగాలను మోహరిస్తుంది. మరోవైపు పాక్ సైనికుల కాల్పులకు ధీటుగా భారత్ సైన్యం ప్రతిఘటిస్తుంది. ఫలితంగా రెండువైపులా కాల్పులు జరుగుతుండటంతో స్థానికులు భయం గుప్పిట బతుకుతున్నారు. ప్రస్తుతం పాకిస్థాన్ లో కొండలపై ఉన్న చకోతి గ్రామ ప్రజలు తమకు ఇళ్లకు సమీపంలో ఉన్న కొండవానులో బలమైన ఆశ్రయాలను సిద్ధం చేసుకున్నారు. కాల్పులు జరిగినా బంకర్లలోకి వెళ్లి తలదాచుకుంటారు. భారత సైనిక చర్య జరిగితే నియంత్రణ రేఖ వెంబడి పెద్దెత్తున ప్రజలు వలస వచ్చే అవకాశం ఉందని భావిస్తున్న పాక్ అధికారులు.. కనీసం ఐదు వందల కుటుంబాలకు టెంట్లు, వస్తు సామాగ్రి, వంట పరికరాలతో కూడిన సహాయ శిబిరాలను సిద్ధం చేస్తున్నారు. ఇండియన్ ఆర్మీ ఎప్పుడైనా విరుచుకుపడొచ్చని భావిస్తున్న పాకిస్థాన్ పీవోకేను దాదాపు ఖాళీ చేయిస్తుంది. దాదాపు 15లక్షల మంది ప్రజలు ఎల్వోసీని వీడినట్లు తెలుస్తోంది. మరికొంత మంది ఇప్పటికే నిర్మించిన బంకర్లలో తలదాచుకుంటున్నట్లు సమాచారం. పీవోకేలో వెయ్యికిపైగా మదరసా పాఠశాలలు పాకిస్థాన్ అధికారులు మూసివేయించారు.

పదిరోజుల పాటు తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ప్రకటించారు. అంతేకాదు.. ముజఫరాబాద్ లో కొంతమందికి ఒక వేళ యుద్ధ పరిస్థితుల్లో గాయాలైతే ఏం చేయాలి.. ఎలాంటి చికిత్స అందించాలో నేర్పిస్తున్నట్లు తెలుస్తోంది. గాయాలైన వారికి ప్రథమ చికిత్స ఎలా చేయాలి.. స్ట్రెచ్చర్ పై ఎలా తీసుకెళ్లాలి.. కాల్పుల నుంచి ఎలా తప్పించుకోవాలనే అంశాలపై పీవోకేలోని స్థానికులకు పాక్ ఆర్మీ సూచనలు చేసినట్లు కొందరు స్థానికులు చెప్పారు. దీంతో యుద్ధం అనివార్యమని పాకిస్థాన్ భయపడుతున్నట్లు స్పష్టమవుతోంది.

**పాకిస్థాన్‌ను కోలుకోలేని దెబ్బకొట్టేందుకు భారత్ భారీ వ్యూహం.. ఇక పాక్ ఖేల్ ఖతం.!...** జమ్ముకశ్మీర్ లోని పహల్గాం ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ కు తగిన గుణపాఠం చెప్పేలా భారత్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో సైనిక చర్యలకు అన్నివిధాల రంగం సిద్ధం చేస్తోంది. దీంతో ఇరుదేశాల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. మరోవైపు పాకిస్థాన్ ఆర్థిక మూలాలను దెబ్బతీయడమే లక్ష్యంగా భారత్ ప్రణాళికలు రచిస్తోంది. పాకిస్థాన్ పై రెండు ఆర్థిక దాడులకు భారత్ వ్యూహాలు రచిస్తోంది. ఈ క్రమంలోనే ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ గ్రేలిస్టులోకి పాకిస్థాన్ ను చేర్చడానికి భారత్ ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఉగ్రవాదానికి ఊతమిచ్చే అతి ప్రమాదకర దేశాలను ఎఫ్ఏటీఎఫ్ బ్లాక్ లిస్ట్ జాబితాలోకి చేరుస్తుంది. గతంలో పాకిస్థాన్ దేశం ఈ జాబితాలో ఉంది. అయితే, 2022లో దాదాపు నాలుగేళ్ల తరువాత అంతర్జాతీయ వేదికపై పాకిస్థాన్ కు ఊరట లభించింది. గ్రే లిస్టు నుంచి పాకిస్థాన్ దేశాన్ని ఎఫ్ఏటీఎఫ్ తొలగించింది. ప్రస్తుతం అదే జాబితాలో పాకిస్థాన్ దేశాన్ని చేర్చేలా అంతర్జాతీయంగా ఒత్తిడి తేవాలని, తద్వారా పాకిస్థాన్ దేశానికి అందే ఆర్థిక సహాయంకు అడ్డుకట్ట వేయాలని భారత్ ప్రయత్నాలను ప్రారంభించింది.

రెండో చర్యగా అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) నుంచి పాకిస్థాన్‌కు అందే ఏడు బిలియన్ డాలర్ల సాయంపై భారత్ తన ఆందోళనను వ్యక్తం చేయనున్నట్లు తెలుస్తోంది. ఐఎంఎఫ్ ద్వారా అందిన ఆర్థిక ప్యాకేజీని పాకిస్థాన్ ఉగ్రవాద సంబంధిత కార్యకలాపాలకోసం వినియోగిస్తుందని, తద్వారా ఆ నిధులను దుర్వినియోగం చేస్తుందని ఆరోపిస్తూ సంబంధిత అంతర్జాతీయ వేదికలపై బలంగా వినిపించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే భారత సైనిక చర్య ద్వారా పాకిస్థాన్ బెంబేలెత్తిపోతుండగా.. మరోవైపు.. పాకిస్థాన్ ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టడంలో భారత్ విజయవంతం అయితే పాకిస్థాన్ కు గట్టిగుణపాఠం చెప్పినట్లే అవుతుంది.

# సంపాదకీయం

## భారత్ ను ఆక్రమిస్తారట..

## బంగ్లా నేతల బలుపు మాటలు

బంగ్లాదేశ్ మాజీ మేజర్ జనరల్ ఏఎల్ఎం ఫజ్లుర్ రెహమాన్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం తీవ్ర కలకలం సృష్టిస్తున్నాయి. భారత్ పాకిస్తాన్‌పై దాడి చేస్తే, బంగ్లాదేశ్ భారత్‌లోని ఏడు ఈశాన్య రాష్ట్రాలను ఆక్రమించాలని ఆయన సూచించారు. ఈ ఆపరేషన్ కోసం చైనాతో కలిసి పనిచేయాలని చర్చలు జరపాలని కూడా ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు భారత్ - బంగ్లాదేశ్ మధ్య సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఫజ్లుర్ రెహమాన్ బంగ్లాదేశ్ ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహ్మద్ యూనస్‌కు సన్నిహితుడిగా తెలుస్తోంది. 2009 నాటి బంగ్లాదేశ్ రైఫిల్స్ తిరుగుబాటుపై విచారణకు నియమించిన కమిషన్‌కు ఆయనను చైర్మన్‌గా తాత్కాలిక ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. అయితే, బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం ఫజ్లుర్ రెహమాన్ వ్యాఖ్యలతో తమకు ఎలాంటి సంబంధం లేదని, అవి ఆయన వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమేనని స్పష్టం చేసింది. బంగ్లాదేశ్ ఏ దేశ సార్వభౌమాధికారాన్ని ప్రశ్నించదని పేర్కొంది. ఈ వ్యాఖ్యలు సరిగ్గా భారత్, పాకిస్తాన్ మధ్య జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో వచ్చాయి. మరోవైపు బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులపై భారత్ ఇప్పటికే తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. తాత్కాలిక ప్రభుత్వం వచ్చిన తర్వాత హిందువులపై దాడులు పెరిగాయని, వారి భద్రతపై బంగ్లాదేశ్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని భారత్ కోరుతోంది. ఈ పరిస్థితుల్లో మాజీ మేజర్ జనరల్ రెహమాన్ చేసిన ఈ వ్యాఖ్యలు బంగ్లాదేశ్‌లోని హిందువుల భద్రతపై భారత దేశ ఆందోళనను మరింత పెంచేవిగా ఉన్నాయి. బెంగళూరులో దారుణం ఇదిలా ఉండగా ఇటీవల బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారు మహ్మద్ యూనస్ కూడా చైనా పర్యటన సందర్భంగా భారతదేశ ఈశాన్య రాష్ట్రాలు భూపరివేష్టిత ప్రాంతాలని, ఆ ప్రాంతానికి సముద్ర మార్గం బంగ్లాదేశ్ ద్వారానే అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు కూడా అప్పట్లో భారతదేశంలో విమర్శలకు తావిచ్చాయి. మొత్తంమీద బంగ్లాదేశ్ మాజీ సైనికాధికారి ఒకరు భారత్‌పై దాడి చేయాలనే సూచనలు చేయడం, దానికి చైనా సహకారం కోరాలని చెప్పడం, ఈయనకు ప్రధాన సలహాదారుతో సాన్నిహిత్యం ఉండటం వంటి అంశాలు భారత్-బంగ్లాదేశ్ సంబంధాలలో కొత్త సవాళ్లను సృష్టించాయి. బంగ్లాదేశ్ ప్రభుత్వం ఈ వ్యాఖ్యలను ఖండించినప్పటికీ, ఈ సంఘటనలు ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయో వేచి చూడాలి. బంగ్లాదేశ్‌లోని మైనారిటీల భద్రత విషయంలో భారత్ తన వైఖరిని గట్టిగా తెలియజేస్తూనే ఉంది.

# నిజాయితీ చాటుకున్న వ్యక్తి ...

**అంతే బాధ్యతగా పోలీసులు డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తి వివరాలు కనుక్కొని అందజేయించారు.**

**అభినందించిన శామీర్పేట సిఐ శ్రీనాథ్, ఎస్సై హారిక...**



శామీర్ పేట, (గరుడ వార్త) : మరుస్తే మాయం చేస్తున్న రోజుల్లో సైతం ఏటీఎంలో డబ్బులు లభించాయని తీసుకువచ్చి పోలీసులకు ఇచ్చి ఓ వ్యక్తి తన నిజాయితీని చాటుకున్నాడు. అంతే బాధ్యతగా శామీర్పేట పోలీసులు సదరు డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తి ఆచూకీ కనుక్కొని మరీ నిజాయితీగా డబ్బులు తెచ్చి ఇచ్చిన వ్యక్తి చేతుల మీదుగానే డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తికి డబ్బులు అందజేయడం పై ప్రజల్లో శామీర్పేట పోలీసులపై హర్షం వ్యక్తం అవుతుంది. శనివారం మండల కేంద్రం శామీర్ పేటకు చెందిన వల్లపు బుచ్చిబాబు అనే వ్యక్తి ఎస్ బి ఐ ఏటీఎంలో డబ్బులు డ్రా చేయడానికి వెళ్ళాడు. ముందుగానే ఏటీఎంలో డ్రా అయి ఉన్నా రూ. 10 వేలను చూసి షాక్ అయిన వ్యక్తి మానవత దృక్పథంతో నిజాయితీగా ఆ డబ్బులను వెంటనే తీసుకెళ్లి శామీర్ పేట పోలీసులకు అప్పగించాడు. పోలీసులు బ్యాంకుకెళ్లి వివరాలు సేకరించగా శామీర్ పేటకు చెందిన మహమ్మద్ నజీర్ ఖాన్ కు చెందిన విగా గుర్తించారు. ఎస్ఐ హారిక నజీర్ ఖాన్ ను పిలిపించి రు. 10 వేలను అందజేశారు.

నిజాయితీగా డబ్బులను పోలీసులకు ఇచ్చిన బుచ్చిబాబును పోలీసులతో పాటు పలువురు అభినందించారు.

# అన్ని దానాల కల్లా విద్యకు తోడ్పాటు అందించే దానమే గొప్పది...

**దాత తంటం శ్రావణ కుమార్**

**అలియాబాద్ లోని అర్షశోధ ఆశ్రమంలో నివసిస్తున్న విద్యార్థులకు బియ్యం, వంట సామాగ్రి, బిస్కెట్లను అందజేసిన దాతలు**



శామీర్ పేట, (గరుడ వార్త) : విద్యతోపాటు క్రీడలు, వేద పఠనం చేస్తున్న ఆశ్రమంలో విద్యార్థుల కొరకు దాతలు ముందుకు వచ్చి సాయమందించి ఆదుకోవాలని దాత తంటం శ్రావణ కుమార్ కోరారు. శామీర్ పేట మండలం అలియాబాద్ పరిధిలోని నిర్వాహకురాలు నీరజ అర్షశోధ సంస్థాన ఆశ్రమాన్ని నెలకొల్పి గత 15 ఏళ్ళుగా కొనసాగిస్తున్నారు. ఈ ఆశ్రమంలో పేద, నిరుపేద పిల్లలకు విద్యతో పాటు కరాటే, వేదం, ధ్యానం, నేర్పిస్తున్నారు. ఈ ఆశ్రమంలో నిరుపేద పిల్లలకు శనివారం అలియాబాద్ గ్రామానికి చెందిన దాతలు తంటం శ్రావణ కుమార్, తంటం విజయలక్ష్మి, తంటం మీనాక్షి లు ముందుకు వచ్చి అభిమానంతో వారికి బియ్యం, కూరగాయలు, బిస్కెట్లు, వంట సామాగ్రి సరుకులను అందజేశారు.

పేద పిల్లలను ఆదుకుని సాయమందించడమే తమ ధ్యేయమని దాతలు చెప్పారు. దాతలు ముందుకు వచ్చి అశ్రమంలోని పిల్లలకు సాయం చేయాలని వారు కోరారు.

# వరుణ దేవా.. కరుణ చూపవా!



గంగాధర: యాసంగిలో ఆరుగాలం శ్రమించి పండించిన పంట కోత దశలో అకాల వర్షాలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇప్పటికే మెడవిరుపు, సుడిదోమ వంట తెగుళ్ల సోకి పంటకు నష్టం మిగిల్చిందని ఆవేదన చెందుతున్నారు. ఆయా గ్రామాల్లోని కేంద్రాల్లో వరి ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు అక్కడక్క డా చినుకులు రాలడంతో ధాన్యం కాపాడుకు నేందుకు పరుగులు పెట్టారు. రానున్న రెండు రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వర్షం కురవచ్చని, గాలులు వీచే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించడంతో రైతులు మరింత ఆందోళన కు గురవుతున్నారు. వరుణాదేవా.. మా వైపు రావద్దని ప్రార్థిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి..**

జిల్లాలో ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టుల ఆధారంగా ఎక్కువగా వరి పంటనే వేశారు. గోదావరి జలాలతో 2,66,896 ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. 3.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. 336 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తుండగా 7412 టార్పాలిన్లు అవసరమని గుర్తించారు. చాలామంది కోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ఏ కేంద్రంలో కూడా టార్పాలిన్లు లేకపోవడంతో రైతులే సొంతంగా కొనుగోలు చేస్తున్నారు. కొందరు యూరియా సంచులను పరదలుగా కుట్టించుకొని ధాన్యంపై కప్పి ఉంచుతున్నారు. కొందరు రైతులు అద్దెకు టార్పాలిన్లు తెస్తున్నారు. టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడంతో రైతులు తమ పంటను దేవుడిపైనే భారం వేస్తున్నారు. కోత దశలో ఉన్న వరిపంట వర్షానికి నేలంతా తేమగా మారి హార్వెస్టర్‌తో కోత చేయడానికి ఇబ్బందులు నెలకొననుండంతో చైన్ యంత్రాలకు డిమాండు పెరుగుతుంది. అప్పుడు ఈ యంత్రానికి అదనంగా రైతులు డబ్బులు వ్యయం చేయాల్సి వస్తుంది.

వర్షాలు కురిసి పొలం మడుల్లో నీరు నిల్వ ఉంటే గండ్లు పెట్టి నీరంతా బయటకు పంపించాలి. లేకపోతే సుడిదోమ సోకే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. సుడిదోమ సోకిన పంట చుట్టూ గాలి తగిలేలా వరి పంట మధ్యలో పాయలు తొక్కాలి. తెగుళు ఉద్ధృతమైతే మాత్రం వ్యవసాయ అధికారుల సూచన మేరకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలి.

మామిడి తోటల్లో కాయలు పక్వ దశకు చేరగా ఈదురు గాలులకు కాయలు రాలిపోయే అవకాశముంది. వర్షాలు, అధిక ఉష్ణోగ్రతలతో మామిడిలో రసం పీల్చే పురుగులు, ఆకుమచ్చ తెగులు ఆశిస్తున్నందున సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి.

ఇక కూరగాయలు సాగు చేసిన రైతులకు అకాల వర్షాల భయం వెంటాడుతూనే ఉంది. లక్షలాది రూపాయల పెట్టుబడులు పెట్టి ఆకాశం వైపు దీనంగా చూస్తున్నారు. పంటలను కాపాడాలంటూ వరుణ దేవుడిని వేడుకు ంటున్నారు.

# ఆస్తీ పన్ను చెల్లింపులకు గడువు పొడిగించిన ప్రభుత్వం

**ఆస్తి పన్ను 5 శాతం తగ్గింపుతో మే 7 వరకు అవకాశం**

శామీర్ పేట, (గరుడ వార్త) : ఐదు శాతం తగ్గింపుతో ఆస్తి పన్నును చెల్లింపులకు ఈ నెల 7వ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తూముకుంట మున్సిపల్ కమీషనర్ వెంకటగోపాల్ చెప్పారు. శనివారం మున్సిపల్ కమీషనర్ వెంకటగోపాల్ మాట్లాడుతూ తూంకుంట మున్సిపల్ పరిధిలోని ప్రజలు 2025-26 సవంత్సరాకి ఆస్తి పన్నులను చెల్లించుటకు గాను ప్రభుత్వం 5 శాతం తగ్గించినట్లు చెప్పారు. 5 శాతం తగ్గింపు ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆస్తి పన్నులను చెల్లించాలని తెలిపారు. తూంకుంట మున్సిపల్ పరిధిలో ఆస్తీ పన్నుల వసూళ్ళకై మున్సిపల్ కు చెందిన సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు కమీషనర్ చెప్పారు. మున్సిపల్ పరిధిలోని ప్రజలు సకాలంలో ఆస్తి పన్నులను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కమీషనర్ కోరారు.

# కార్మికుల కవాత్ విజయవంతం చేయాలి

శామీర్ పేట, (గరుడ వార్త) : ఆర్టీసీ కార్మికుల కవాతు విజయవంతం చేయాలని టీఎంయూ హకీంపేట డిపో కార్యదర్శి గోపు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 5న నగరంలోని ఆర్టీసీ కళాభవన్ నుంచి బస్సు భవన్ వరకు ఆర్టీసీ కార్మికుల కవాత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. దీనికి6 నిరసనగా ఈ నెల 5న కవాత్ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ఈ నెల 7వ తేది నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెను చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సత్తా ఏమిటో ప్రభుత్వానికి చూపించడానికి, సమస్యల సాధనకై చివరి పోరాటంగా ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆయన వివరించారు. స్పెషల్ ఆఫ్ ఉన్న ఆర్టీసీ కార్మికులు, మొదటి షిఫ్ట్ డ్యూటీ చేసిన కార్మికులు, నైట్ ఔట్ ఇన్ కమింగ్ అయిన ఆర్టీసీ కార్మికులు తప్పని సరిగా ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఆందోళన, నిరసన కార్యక్రమంలో తప్పని సరిగా పాల్గొని విజయవంతం చేయాలని గోపు శ్రీనివాస్ కోరారు.

# రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగించండి

న్యూఢిల్లీ : తెలంగాణలో జరిగినట్లుగా దేశమంతటా సామాజిక, ఆర్థిక, విద్యాపరంగా వెనకబాటుతనాన్ని నిర్ధారిస్తూ కులగణన జరిపించాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) డిమాండ్ చేసింది. కులగణన విషయంలో తెలంగాణ నమూనానే దేశవ్యాప్తంగా అమలు చేయాలని కోరింది. ఈ మేరకు ఇక్కడ జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో తీర్మానం చేసింది.

తెలంగాణలో అత్యంత శాస్త్రీయంగా, వివిధ రంగాల్లో వెనకబాటుతనాన్ని నిర్ధారిస్తూ కులగణన జరిగిందని, మోదీ ప్రభుత్వం ఏ ప్రాతిపదికన కులగణన జరపాలని నిర్ణయిస్తుందో తెలియజేయాలని కోరింది. 50 శాతానికి మించి రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేసింది.

# శస్త్రచికిత్సలకే మొగ్గు

మెట్‌పల్లి: సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం ఇవ్వాలని అటు ప్రభుత్వం, ఇటు వైద్యారోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నా ఆచరణలో మాత్రం నెరవేరడం లేదు. పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధిక శాతం శస్త్రచికిత్స కాన్పులే జరుగుతుండగా, ప్రభుత్వ ఆసుపత్రులు సైతం అదేబాట పడుతున్నట్లు గణాంకాలు చూస్తే అర్థమవుతోంది. శస్త్రచికిత్స కాన్పుల వల్ల భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రిస్క్ కేసుల్లో, ప్రత్యేక సందర్భాల్లో తల్లి, బిడ్డ క్షేమం కోసం శస్త్రచికిత్స ప్రసవాలు చేయాలన్న నిబంధనలున్నా, చాలా వరకు శస్త్రచికిత్స ప్రసవాలకే మొగ్గు చూపుతుండడం ఆందోళనకరమని పలువురు పేర్కొంటున్నారు. వాస్తవానికి ప్రభుత్వాసుపత్రుల్లో గర్భిణులకు సుఖ ప్రసవాలు అయ్యేలా వారితో వ్యాయామాలు, ఆసనాలు చేయించడానికి మిడ్‌వైఫరీ నర్సుల వ్యవస్థ ఉంది. కానీ గర్భిణుల కుటుంబాలు కొందరు ముహూర్తాలు, మంచి రోజులు చూసుకోవడం, నొప్పులు భరించలేమని చెబుతూ వైద్యులపై ఒత్తిళ్లు




తేవడం కూడా సుఖ ప్రసవాలకు బదులు శస్త్రచికిత్సలు పెరగడానికి కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆరోగ్య సిబ్బంది శస్త్రచికిత్సల వల్ల భవిష్యత్తులో వచ్చే అనారోగ్య సమస్యలను వివరించి సాధారణ ప్రసవాలపై గర్భిణులకు అవగాహన కల్పించాలని పలువురు పేర్కొంటున్నారు.

**నియంత్రిస్తేనే..**

మెట్‌పల్లి ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు 982 ప్రసవాలు జరిగాయి. ఇందులో సాధారణ 259, శస్త్రచికిత్స కాన్పులు 723 చేశారు. ఇటీవల జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో సాధారణ ప్రసవాలు తగ్గుముఖం పట్టడంపై కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆరా తీశారు. సుఖ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులతో మాట్లాడారు. మెట్‌పల్లి మండల పరిధిలో ఏడాది వ్యవధిలో 702 ప్రసవాలు జరిగాయి. వీటిలో సాధారణ కాన్పులు 154, శస్త్రచికిత్స కాన్పులు 548 జరిగాయి. సుమారు 78 శాతం శస్త్రచికిత్స ప్రసవాలు జరగగా, సాధారణ కాన్పులు కేవలం 22 శాతం మాత్రమే జరిగాయి. ఇందులో మొదటి కాన్పు(ప్రైమీ) 401 జరగగా, ప్రభుత్వాసుపత్రిలో 250, ప్రైవేట్ ఆసుపత్రుల్లో 151 కాన్పులు చేశారు. ప్రభుత్వాసుపత్రులో జరిగిన కాన్పుల్లో 54 సాధారణ, 196 శస్త్రచికిత్స, ప్రైవేట్‌లో జరిగిన కాన్పుల్లో 27 సాధారణ, 124 శస్త్రచికిత్స ప్రసవాలు జరిగాయి.

**అవగాహన కల్పిస్తున్నాం: సాజిద్‌అహ్మద్, సూపరింటెండెంట్, మెట్‌పల్లి సామాజిక ఆసుపత్రి**

ఆసుపత్రిలో ఉన్న ఇద్దరు మిడ్‌వైఫరీ నర్సుల ద్వారా గర్భిణులకు నిరంతరం అవగాహన కల్పిస్తున్నాం. సాధారణ ప్రసవాలకు సిద్ధమయ్యేలా వారిలో అవగాహన పెంపొందిస్తున్నాం. శస్త్రచికిత్స వల్ల భవిష్యత్తులో వచ్చే సమస్యలను వివరిస్తున్నాం. క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలు గర్భిణులకు సూచనలివ్వాలని చెబుతున్నాం.

# రోడ్డు తవ్వేస్తామంటూ.. అడ్డగోలు ప్రతిపాదనలు

హైదరాబాద్: నగరం నలుమూలల నుంచి రహదారుల తవ్వకాల కోసం ఇంజినీర్లు పంపుతున్న ప్రతిపాదనలు అడ్డగోలుగా ఉంటున్నాయని జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయం ఆందోళన వ్యక్తం చేసింది. పూర్తి వివరాలు పేర్కొనకుండా ప్రతిపాదనలు పంపిస్తుండటంపై ముఖ్య ఇంజినీరు(సీఈ) సహదేవ్ రత్నాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపాదనలు నమూనాలతో ఆయన తాజాగా ఇంజినీర్లకు మార్గదర్శకాలు జారీ చేశారు.

**మార్గదర్శకాలు ఇలా..**

10మీటర్ల పొడవున రోడ్డును తవ్వేందుకు సర్కిల్ స్థాయిలో కార్యనిర్వాహక ఇంజినీరు.. 10నుంచి 15మీటర్ల మధ్య జోన్ స్థాయిలోని సూపరింటెండెంట్ ఇంజినీరు అనుమతి తీసుకోవాలి. అంతకన్నా పెద్ద ప్రతిపాదనలను ముఖ్య ఇంజినీరు ఆమోదిస్తారు.

తవ్విన రోడ్లను పునరుద్ధరించే పనులకు పరిపాలన అనుమతి కావాలంటే.. ఆయా రహదారులను తవ్వడానికి ప్రజలు లేదా సంస్థ పెట్టుకున్న అర్జీని జత చేయాలి.జీ.వో.నెం.53 ప్రకారం చదరపు



మీటరు తారురోడ్డు తవ్వేందుకు రుసుమును కచ్చితంగా అంచనా వేయాలి. లోపాలకు ఇంజినీర్లే బాధ్యులు.

**తప్పని విమర్శలు**

ఈ మార్గదర్శకాలపై విమర్శలొస్తున్నాయి. రహదారి తవ్వకానికి అంచనాలు రూపొందించడంతోపాటే.. ఆ రోడ్డును పునరుద్ధరించేందుకు అవసరమైన టెండరు నోటిఫికేషన్ రూపుదిద్దుకోవాలి. పునరుద్ధరణ పనులకు గుత్తేదారును సిద్ధం చేశాకే.. తవ్వకం అనుమతి జారీ అవ్వాలి. గతంలోని ఈ నిబంధనను చీఫ్ ఇంజినీరు కార్యాలయం పట్టించుకోవట్లేదనే ఆరోపణలొస్తున్నాయి. రోడ్డు తవ్వకం పనులు పూర్తయ్యాక పునరుద్ధరణ పనులకు ప్రతిపాదనలు పంపాలన్న సీఈ ఆదేశాలు సరికాదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తారు రోడ్డును చదరపు మీటరు తవ్వితే రూ.4,550, సీసీ రోడ్డును తవ్వితే రూ.3,688ల రహదారి పునరుద్ధరణ రుసుమును వసూలు చేయాలనే నిబంధనను జీహెచ్ఎంసీ గుడ్డిగా అనుసరిస్తోంది. తారు రోడ్డుతో పోలిస్తే.. నాలుగు రెట్ల అదనపు ఖర్చుతో వీడీసీసీ రోడ్ల నిర్మాణం జరుగుతోంది. పునరుద్ధరణ రుసుము మాత్రం తారు రోడ్డుకన్నా తక్కువ ఉండటం విమర్శలకు తావిస్తోంది.

# చల్లగా వచ్చి దోచుకెళ్లాడు

కరీంనగర్ : అర్ధరాత్రి సమయంలో చల్లగాలి కోసం ఇంటి ప్రధాన తలుపు తీసి, జాలి తలుపు వేసుకొని నిద్రిస్తే ఓ దుండగుడు ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలను అపహరించుకుపోయాడు. కరీంనగర్ రెండో ఠాణా సీఐ సృజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ సప్తగిరికాలనీకి చెందిన నేరెళ్ల రమేశ్‌గౌడ్ రెండేళ్లుగా ఆదిలాబాద్ భుక్తపూర్‌లో మెడికల్ ఏజెన్సీని నిర్వహిస్తున్నారు. సోమవారం తన భార్య సోదరుడి కుమారుడు నామకరణం ఉండటంతో రమేశ్‌గౌడ్, అతని భార్య సుజాత ఆదివారం కరీంనగర్‌కు వచ్చి శుభకార్యానికి కావాల్సిన వస్తువులు కొనుగోలు చేసి అర్ధరాత్రి ఇంటికి వచ్చారు. ఇంట్లో చల్లగాలి కోసం రెండు వైపులా ఉన్న తలుపులు తీసి జాలి డోర్లను దగ్గరకు వేసి నిద్రించారు. ఉదయం శుభకార్యానికి వెళ్లేందుకు బంగారు ఆభరణాలు, నగదును ఒక సంచిలో వేసి ఉంచారు. సోమవారం ఉదయం లేచి నామకరణం వేడుకకు వెళ్లేందుకు సిద్ధంకాగా ఆభరణాల సంచి కనిపించలేదు. రూ.2.62 లక్షల విలువగల ఆభరణాలు, బీరువాలోని రూ.35 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. నగర ఏసీపీ వెంకటస్వామి, సీఐ సృజన్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఇంట్లో ఉన్న సీసీ కెమెరాను పరిశీలించగా ఓ యువకుడు ఇంట్లోకి ప్రవేశించినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

# సర్కారు బడుల్లో సౌకర్యాలపై ఆరా

పెద్దపల్లి : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పాఠశాలలు బలోపేతం అవుతున్నా.. బాలల ప్రవేశాలు పెరగడంలేదు. విద్యార్థుల సామర్థ్యాలు ఆశించిన స్థాయిలో ఉండటంలేదు. ఏటా ప్రభుత్వానికి విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు వాటిపై గణాంకాలు అందిస్తున్నా మార్పు ఎందుకు రావడం లేదనే ప్రశ్న తలెత్తుతుంది. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు వాటి పరిస్థితి ఎలా ఉందనే దానిపై రాష్ట్ర విద్యాశాఖ సర్వే చేపట్టేందుకు ముందుకొచ్చింది. ఈనెల 21 వరకు ఉమ్మడి జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో కరీంనగర్ సమీపంలోని 130 మంది డైట్ కళాశాల ఛాత్రోపాధ్యాయులు దీనిపై సర్వే చేపడుతున్నారు. **పొందుపరిచిన వివరాల ఆధారంగా**

ఏటా ఉమ్మడి జిల్లాలో పాఠశాలల వారీగా ప్రధానోపాధ్యాయులు యూడైస్ ప్లస్‌లో వివరాలను ప్రామాణికంగా పొందుపరుస్తున్నారు. వాటి ఆధారంగానే వాటిలో సౌకర్యాల కల్పన, ఇతరత్రా వాటికి ప్రభుత్వాలు బడ్జెట్‌లు కేటాయిస్తున్నాయి. అన్ని యాజమాన్యాల పాఠశాలలకు తోడు జూనియర్ కళాశాలల సమగ్ర వివరాలను ఇందులో నమోదు చేస్తున్నారు. వాటిలో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది, ఖాళీలు, మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, తరగతి గదుల పరిస్థితి, క్రీడా మైదానాలు, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు, మరుగుదొడ్లు, తాగునీరు తోపాటు కొరతగా ఉన్న వాటి వివరాలను ప్రధానోపాధ్యాయులు పొందుపరుస్తున్నారు. **ఒక్కొక్కరికి 10 పాఠశాలలు**

ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గాకుండా విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న వాటిల్లో ఈ సర్వే చేపడుతున్నారు. ఒక్కొక్కరు నిత్యం 10 పాఠశాలలను సందర్శించి పాఠశాల విద్యా ప్రామాణిక రిపోర్టు ఆధారంగా సర్వే చేస్తారు. వాస్తవ పరిస్థితుల వివరాలను యూడైస్ ప్లస్‌లో నమోదు చేశారా? విద్యార్థుల సంఖ్య, సౌకర్యాలు ఏ మేరకు ఉన్నాయనేది పరిశీలించి ధ్రువీకరించనున్నారు. వాటిలో తప్పులుంటే సరి చేయాలని రిమార్కులు అందిస్తారు. అప్పటికప్పుడు సీఆర్పీల సాయంతో ప్రధానోపాధ్యాయులు సరిచేస్తారని.. కరీంనగర్ జిల్లా సమగ్రా శిక్షా ప్లానింగ్ కో-ఆర్డినేటర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు.

# వేసవి క్రీడలకు వేళాయె



ఆసిఫాబాద్ : జిల్లాలో గురువారం నుంచి 14ఏళ్ల లోపు బాల, బాలికలకు వేసవి క్రీడా శిబిరాలు నిర్వహించేలా జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు. నెల రోజుల పాటు నిర్వహించే వీటి కోసం ఇప్పటికే శిక్షకుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఎంపిక చేశారు. అన్ని జిల్లాలకు క్రీడా సామగ్రి పంపిస్తామని బుధవారం రాష్ట్ర యువజన, క్రీడల సర్వీసు విభాగం అధికారులు అన్ని జిల్లాల యువజన క్రీడల అధికారులతో టెలి కాన్ఫరెన్సులో పేర్కొన్నారు. గురువారం క్రీడా సామగ్రి జిల్లాకు చేరుతోందని.. ఆలోపు కబడ్డీ, ఖోఖో వంటి క్రీడలను ప్రారంభించేలా అధికారులు సిద్ధమవుతున్నారు. అవి వచ్చాక నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నారులకు తర్ఫీదునిస్తారు. అయితే ఈ సారి పట్టణాల కంటే మెజారిటీ గ్రామీణ ప్రాంతాల్లోనే శిబిరాలు ఏర్పాటు చేశారు.

**విధిగా హాజరు..**

ఇది వరకు క్రీడా శిబిరాలకు వచ్చే క్రీడాకారుల పేర్లు నామమాత్రంగా నమోదు చేసేవారు. తక్కువ వచ్చినా ఎక్కువ వచ్చినట్లు చూపే వారనే విమర్శలు ఉన్నాయి. ఈ సారి శిబిరాలకు వచ్చే ప్రతి క్రీడాకారుడి పేరు, ఆధార్ వివరాలు అంతర్జాలంలో నమోదు చేయాలి. ఒక్కో శిబిరంలో కనీసం 20 మందికి తక్కువ కాకుండా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేలా చూడాలి. అదే కాకుండా రోజూ శిబిరాలకు వచ్చే వారి హాజరు నమోదు చేయాలి. దీంతో ఏ శిబిరంలో ఎంత మంది వస్తున్నారనేది స్పష్టంగా తెలుస్తుంది. శిబిరాలకు తమ పిల్లలను పంపించేలా తల్లిదండ్రులు సైతం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. వేసవిలో సమయాన్ని వృథా చేయకుండా క్రీడలకు వెచ్చించడంతో మానసిక ప్రశాంతత, ఆరోగ్యం సిద్ధిస్తుంది.

**ఎక్కడ ఏ క్రీడలంటే..**

జిల్లా కేంద్రం జన్కాపూర్‌లో హ్యాండ్‌బాల్, రాజంపేట్‌లో ఖోఖో, ఆసిఫాబాద్ మండలం బూరుగూడలో నెట్‌బాల్, తిర్యాణి మండలం రోంపల్లిలో కబడ్డీ, మండల కేంద్రంలో అథ్లెటిక్స్, అదే మండలం రాళ్లకన్నెపల్లిలో వాలీబాల్, కాగజ్‌నగర్ మండలం బురుదగూడెంలో షూటింగ్‌బాల్, సరండిలో సాఫ్ట్‌బాల్, వేంపెల్లిలో బాక్సింగ్, నజ్రూల్‌నగర్‌లో కరాటే శిక్షణ శిబిరాలను నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం పది మంది శిక్షకులను నియమించారు. ఈ సారి శిక్షకులకు ఇచ్చే గౌరవ వేతనం రూ.వెయ్యి పెంచారు. ఇది వరకు రూ.4 వేల పారితోషికం ఇచ్చే వారు.

# మూడేళ్లవుతున్నా.. ముందడుగేది?



ఉట్నూరు : మూడేళ్ల కిందట కొత్త వంతెనలు, రహదారుల మరమ్మతులకు రూ.12 కోట్లు మంజూరయ్యాయి. పనులు చేపట్టడంలో మాత్రం తీవ్ర జాప్యం జరుగుతోంది. ఉట్నూరు నుంచి ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో వాగులపై వంతెనలు శిథిలావస్థకు చేరి తరచూ ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నాయి. టెండర్ల ప్రక్రియను పూర్తిచేసిన అధికారులు కొత్త వంతెనల నిర్మాణ పనులు ప్రారంభించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఏజెన్సీ కేంద్రమైన ఉట్నూరు నుంచి ఆదిలాబాద్, మహారాష్ట్రకు వెళ్లే బీటీ రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. ఆ రోడ్డు మధ్యలో పులిమడుగు, నాగాపూర్, శ్యాంపూర్, హస్నాపూర్, ఏందా గ్రామాల వద్ద వాగులు, కాలువలు ఉండటంతో గతంలో రెండు కల్వర్టులు, రెండు వంతెనలు నిర్మించారు. భారీ వాహనాలు వెళ్లడం, రద్దీ పెరగడం, వర్షాలతో వాగులు పొంగి కల్వర్టులు దెబ్బతిన్నాయి. వంతెనల గోడలు ధ్వంసమై ప్రమాదకరంగా మారాయి. ఏటా ఈ రహదారిపై ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. పలు వాహనాలు వాగుల్లో పడి ధ్వంసమయ్యాయి. ఏళ్లుగా కొత్త వంతెనలు నిర్మించాలని మొరపెట్టుకుంటుంటే ప్రభుత్వం స్పందించి 2022లో కొత్త వంతెనలు మంజూరు చేసింది. రూ.12 కోట్లతో నిర్మాణం కోసం రోడ్లు - భవనాల(ఆర్అండ్‌బీ) శాఖ ఆధ్వర్యంలో టెండర్లను పిలిచారు. నిర్మాణ పనులు చేపట్టడంతో జాప్యం జరుగుతోంది.

**చేపట్టాల్సిన పనులివే..** శిథిలావస్థకు చేరిన నాగాపూర్, పులిమడుగు, శ్యాంపూర్, హస్నాపూర్, ఏందా ఈ అయిదు వంతెనలను తొలగించి వాటి స్థానంలో కొత్త వంతెనలు నిర్మించాల్సి ఉంది. వీటికి ఇరువైపులా రహదారి మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఉట్నూరు మండల కేంద్రం నుంచి 8 కిలోమీటర్ల దూరంలోని పులిమడుగు గ్రామం శివారులోని వాగుపై రూ.4.50 కోట్లతో 60 మీటర్ల పొడవు, 10 మీటర్ల ఎత్తులో వంతెన నిర్మించాలని ప్రణాళికను రూపొందించారు. వీటితోపాటు రెండు కిలోమీటర్ల వరకు రహదారి మరమ్మతులు చేయనున్నారు.

శ్యాంపూర్, ఏందా గ్రామాలలోని వంతెనలు శిథిలావస్థకు చేరాయి. గోడలు పడిపోయి ప్రమాదకరంగా మారాయి. ఈ రెండు గ్రామాలలో ఒక్కో వంతెన రూ.3 కోట్లతో రెండు వంతెనలు నిర్మించాల్సి ఉంది. వంతెనలకు ఇరువైపులా రెండు కిలోమీటర్ల వరకు రోడ్డును బాగు చేయాల్సిఉంది.

నాగాపూర్‌లోని శివసాగర్ ప్రాజెక్టు కింది భాగంలోని వాగుపై ఉన్న వంతెన తెగిపోయింది. ఏటా వర్షాకాలంలో వాగు పొంగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు రూ.2 కోట్లతో 40 మీటర్ల పొడువు, 6 మీటర్ల ఎత్తుతో కొత్త వంతెన నిర్మించాల్సి ఉంది.

**గుత్తేదారులకు నోటీసులు ఇచ్చాం.. -ఎస్.నర్సయ్య, ఈఈ, ఆర్అండ్‌బీ**

వంతెనలు మంజూరై టెండర్ల ప్రక్రియ పూర్తయింది. గుత్తేదారులు పనులు చేపట్టడంలో ఆలస్యం చేస్తున్నారు. గుత్తేదారులకు నోటీసులు ఇచ్చాం. త్వరలో పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

# కబ్జా చేస్తారు.. దర్జాగా పాతుకుపోతారు!

ఖమ్మం : ఖమ్మం జిల్లాలో అత్యధికంగా తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడులోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయ భూములు ఆక్రమణకు గురయ్యాయి. దేవాదాయశాఖ లెక్కల ప్రకారమే 512.33 ఎకరాలు కబ్జా చెరలో ఉన్నాయి. దశాబ్దాలుగా ఈ భూములను ఆక్రమించుకున్నవారు దర్జాగా పంటలు పండిస్తున్నారు. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ భూముల్లో సగానికి పైగా ఆక్రమణల చెరలోనే ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో రాములవారికి 1,300 ఎకరాల వరకు స్థలాలు ఉండగా.. వీటిలో 985.24 ఎకరాలు కబ్జాకు గురయ్యాయి. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నంలో స్వామివారి 800 ఎకరాల భూముల్లో ఎక్కువ భాగం ఆక్రమణల్లో ఉన్నాయి. వీటిని స్వాధీనపరచుకునేందుకు గతంలో చాలాసార్లు ఆలయాధికారులు ప్రయత్నించినా ఫలితం లేదు. స్థలాలు దేవస్థానానివేనని ఆలయాధికారులు, హక్కులన్నీ తమకే ఉన్నాయని పురుషోత్తపట్నానికి చెందిన కొందరు తెగేసి చెబుతున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో దశాబ్దాలుగా దేవాదాయశాఖ భూములు అత్యధికం ఆక్రమణల చెరలోనే మగ్గుతున్నాయి. 225 ఆలయాల ఆధీనంలో సుమారు 14,391 ఎకరాల భూములు ఉన్నాయి. ఉభయ జిల్లాల్లో 9,675 ఎకరాలను కౌలుకు ఇచ్చారు. 1,595 ఎకరాల భూమి అర్చకుల ఆధ్వర్యంలో ఉండగా.. 1,137 ఎకరాల భూములు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఖమ్మం జిల్లాలో 833.02 ఎకరాలు, భద్రాద్రి జిల్లాలో 1151.05 ఎకరాల ఆలయాల భూములు కబ్జా కోరల్లో చిక్కుకున్నట్లు దేవాదాయశాఖ గుర్తించింది. వీటికి సంబంధించి దేవాదాయశాఖ ట్రైబ్యునల్‌లో 39, హైకోర్టులో 35 కేసులు నడుస్తున్నాయి. దేవాదాయశాఖకు కొందరు రైతులు కౌలు కూడా చెల్లించకపోవటం గమనార్హం.



దేవాదాయశాఖకు సవాల

ఉభయ జిల్లాల్లోని దేవుడి మాన్యాలు, ఆస్తులు, భూములను పరిరక్షించేందుకు దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధునిక, సాంకేతికతను ఉపయోగించినా ఫలితం లేకుండా పోయింది. ఆలయాల స్థలాలకు సంబంధించి గూగుల్ సహకారంతో జియో ట్యాగింగ్ పూర్తిచేశారు. కబ్జాలకు గురైన భూముల్లో అత్యధికం దేవాలయాల భూములే ఉన్నాయి. దాదాపు అన్ని ప్రాంతాల్లో రూ.కోట్ల విలువైన స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా వాటిని స్వాధీనపరచుకోవటంలో సంబంధింత శాఖ అధికారులు విఫలమవుతున్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణకు సరిపడా సిబ్బంది లేకపోవటంతోచేతులెత్తేస్తున్నారు. ఆక్రమణల పర్వం అంతకంతకూ పెరిగేందుకు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలేమి మరో కారణమనే వాదనలు వ్యక్తమవుతున్నాయి.

దేవాదాయశాఖ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. ఆక్రమణలకు సంబంధించి ప్రభుత్వానికి అన్ని వివరాలు సమర్పించాం. కొన్ని ఆలయాల భూముల కబ్జాలపై కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ముందుకెళ్తాం.

ఎం.వీరాస్వామి, దేవాదాయశాఖ సహాయ కమిషనర్

# మట్టిగుట్టలు.. మాయం..!

నకిరేకల్ : గుట్టలుగా నిల్వ చేసిన మట్టిని అక్రమార్కులు గుట్టుగా తరలిస్తున్నారు. అనుమతులు లేకుండా తరలిస్తుండటంతో ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో రావాల్సిన ఆదాయానికి గండిపడుతోంది. జిల్లాలో ముఖ్యమైన నీటి వనరుగా ఉన్న ఏఎంఆర్ ప్రధాన కాల్వ వెంట నిల్వ చేసిన మట్టి (సాయిల్ బ్యాంక్) తరిగిపోతోంది. ప్రధాన కాల్వ తవ్వకం ద్వారా వచ్చిన మట్టిని గతంలో దీని వెంట గుట్టలుగా పోసి నిల్వ చేశారు. ప్రధాన, డిస్ట్రిబ్యూటరీ, పిల్లకాల్వలకు గండ్లు పడినప్పుడు, పంట కాల్వలు, కాల్వకట్టలపై రహదారుల నిర్మాణం తదితర ప్రభుత్వ నిర్మాణల భవిష్యత్ అవసరాల కోసం వినియోగించేందుకు దీనిని నిల్వ చేశారు. వేల క్యూబిక్ మీటర్లలో ఉన్న ఈ మట్టిపై అక్రమార్కులు కన్నేసి కాజేస్తున్నారు. ఈ కాల్వ వెంట నీటిపారుదల శాఖ లస్కర్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నా.. మట్టి మాయమవుతుండటం గమనార్హం.

నకిరేకల్- కేతేపల్లి మండలాల మధ్య కాల్వ వెంట 25 కి.మీ నుంచి 27 కి.మీ వరకు ఉన్న మట్టిని తాజాగా తరలిస్తున్నారు. భవన నిర్మాణ పనులు, ఇతర అవసరాల కోసం మట్టిని పొక్లెయిన్లతో తోడి ట్రాక్టర్లు, టిప్పర్లతో తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలున్నాయి. ఈ మట్టిని ఒక్కో ట్రిప్పును రూ.వెయ్యి నుంచి 1200 వరకు వరకు విక్రయిస్తున్నారు. అధికారుల ప్రత్యేక అనుమతితో ప్రభుత్వ అవసరాల కోసం గుత్తేదారులు క్యూబిక్ మీటరుకు రూ.70 చొప్పున గనుల శాఖకు చెల్లించి తరలించుకునే వీలుంది. ఎలాంటి అనుమతులు



లేకుండా ప్రైవేట్ నిర్మాణాల కోసం తీసుకెళుతున్నారు

ప్రధాన కాల్వకు ఇరువైపులా ఏఎంఆర్పీ స్థలంలో నిల్వ చేసిన ఈ మట్టి ఖాళీచేసిన భూములను సమీప రైతులు తమ పట్టాభూముల్లో కలిపేసుకుంటున్నారు. కాల్వ వెంట రహదారులను ఆక్రమించేస్తున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు పట్టించుకోకపోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మట్టి దందాను నిరోధించి ఏఎంఆర్పీ భవిష్యత్ అవసరాల కోసం మట్టిని కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం**

ఏఎంఆర్పీ ప్రధాన కాల్వ వెంట మట్టిని తరలిస్తున్న విషయం మాదృష్టికి రాలేదు. వెంటనే పరిశీలించి మట్టి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటాం. మాశాఖ లస్కర్ సిబ్బందిని అప్రమత్తం చేస్తాం.
మహేశ్ ఏఈ, నీటిపారుదల శాఖ

# ఆదాయం.. అంతంతే..!

నల్గొండ : ఉమ్మడి జిల్లాలోని స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖకు గడిచిన ఆర్థిక ఏడాదిలో వచ్చిన ఆదాయం నామమాత్రంగానే ఉంది. 2023-24 ఆర్థిక ఏడాదితో పోల్చితే 2024-25 ఏడాదిలో అదనంగా రూ.7 కోట్లు మాత్రమే పెరిగింది. గత ఏడాదిలో రూ.412.37 కోట్లు వస్తే 2024-25లో మార్చి చివరి నాటికి రూ.419.49 కోట్లు వచ్చాయి. ప్రభుత్వానికి ఆదాయం పెరిగినా సంబంధిత శాఖ లక్ష్యానికి చేరువ కాలేకపోయింది. జిల్లాలో 15 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా గత ఏడాది 1,43,426 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు జరగ్గా.. ఈఏడాది 1,38,729 జరిగాయి. రిజిస్ట్రేషన్లు తక్కువగా ఉన్నా పెరిగిన ధరలతో రూ.7 కోట్లు ఆదాయం వచ్చింది. అత్యధికంగా నల్గొండ, సూర్యాపేట, యాదగిరిగుట్ట, దేవరకొండ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఆ తరువాత స్థానాల్లో చౌటుప్పల్ భువనగిరి, బీబీనగర్ కోదాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి.

**అవగాహన పెరిగి..**

జిల్లాలో గత ఆర్థిక ఏడాదిలో భూముల క్రయ,విక్రయాలు అనుకున్న స్థాయిలో జరగలేదని సంబంధిత అధికారులు వాపోతున్నారు. గతంతో పోల్చితే ఈ ఏడాది వంద గజాల స్థలం కొనుగోలు చేసేవారు కూడా అన్ని విధాలా పరిశీలన చేస్తున్నారు. ప్రభుత్వ భూమి, శిఖం భూమి, ఎఫ్‌టీఎల్, నాన్ ఎఫ్‌టీఎల్ వంటి, వెంచర్ల అనుమతులు, నాలాల అనుమతులతో పాటు ఎల్ఆర్ఎస్ అనుమతులపై అన్ని వర్గాల వారిలో అవగాహన పెరిగింది. దీంతో ఎలాంటి ఇబ్బందులు లేని భూములను కొనుగోలు చేయడానికే ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు.

**వేగవంతంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ**

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతంగా, పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడ అవినీతికి తావులేకుండా చూస్తున్నాం. మధ్యవర్తులు లేకుండా అధికారులు, సిబ్బందితో పనులు చేయించుకోవాలి. అవినీతికి పాల్పడేవారి సమాచారం ఇచ్చేవారు నేరుగా జిల్లా కార్యాలయంలో సంప్రదించవచ్చు. ఎల్ఆర్ఎస్‌కు అర్హత ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. ఆన్‌లైన్ స్లాట్‌బుకింగ్‌లు త్వరలో అన్ని కార్యాలయాల్లో అమలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎస్. ప్రకాశ్, డీఆర్ ఉమ్మడి నల్గొండ

# సభ్యత్వాల పేరుతో అక్రమాలు..!

నల్గొండ : మత్స్యకారుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని పలువురు దోపిడీ చేస్తున్నారు. మత్స్య సహకార సంఘాలు ఉన్నా.. వాటి నిర్వహణపై అధికారులు శ్రద్ధ పెట్టకపోవడం వల్ల అవి కనుమరుగైపోతున్నాయి. మిర్యాలగూడ మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో సభ్యత్వాలు ఇప్పిస్తామంటూ కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారు. మిర్యాలగూడ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పరిధిలో మిర్యాలగూడ పెద్ద చెరువు, యాదగార్‌పల్లి, శ్రీనివాసనగర్, చింతపల్లి చెరువులు ఉన్నాయి. గతంలో ఇందులో 281 మంది సభ్యులు ఉండగా.. ప్రస్తుతం 71 మంది ఉన్నారు. ఆరేళ్లుగా కొత్త సభ్యులను చేర్చడం లేదు. ఇటీవల ఎలాంటి జనరల్ సమావేశం లేకుండా..వారసులకు సభ్యత్వాలు ఇస్తామంటూ కొత్త సభ్యులను చేర్చుకునే కార్యక్రమానికి తెరలేపారు. ఇలా ఒక్కొక్కరి నుంచి రూ.3000 చొప్పున 200 మంది నుంచి డబ్బులు వసూలు చేశారని విశ్వసనీయ సమాచారం. ఇందులో అధికారుల పాత్ర ఉందని సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈత రాకున్నా, చేపలు పట్టడం తెలియకున్నా.. సభ్యత్వం ఇప్పిస్తామంటూ సంఘంలో కొందరు పెద్ద మొత్తంలో వసూలు చేశారు. ఈనెల 16న కొత్త సభ్యులను చేర్చుకునే తేదీ ఎంపిక చేశారు. చెరువులో వలలు వేయడం, చేపలు పట్టడం వచ్చిన మత్స్యకార్మికులు తాము సభ్యత్వాలకు డబ్బులు ఎందుకు ఇవ్వాలని మిర్యాలగూడ శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డికి ఫిర్యాదు చేశారు. బైలా ప్రకారం రుసుం తీసుకొని సభ్యత్వం ఇవ్వాలని కానీ.. రూ.3వేలు ఏంటని ప్రశ్నిస్తున్నారు.

**16న కొత్త సభ్యుల ఎంపిక** మత్స్యకార సంఘంలో కొత్త సభ్యులను చేర్చుకునే సందర్భంలో ఈత కొట్టడం, వలలు వేయడం, చేపలు పట్టడం చేస్తుంటే మత్స్యశాఖ వీడియోలో చిత్రీకరించాలి. ఈ కార్యక్రమం మిర్యాలగూడలో 16న చేస్తామని మత్స్యశాఖ అధికారులు చెప్పారని కొందరు సభ్యులు తెలిపారు. ఇందులో వృత్తిలో అనుభవం ఉన్న వారిని ఎంపిక చేయాలని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సభ్యుల వద్ద వసూలు చేసిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరుతున్నారు.

**అనుభవం మేరకే..** మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో అనుభవం ఉన్న వారికే సభ్యత్వం ఇస్తాం. వారి నైపుణ్యాన్ని వీడియోలు తీస్తాం. అనుభవం లేని వారికి ఇవ్వం. కొత్త సభ్యులను చేర్చుకుంటారని ఎవరి వద్ద డబ్బులు వసూలు చేయలేదు.

# నది నుంచి నల్లా దాకా..!

చౌటుప్పల్: ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 35 లక్షల మందికి కృష్ణా, గోదావరి నదుల నీళ్లు మిషన్ భగీరథ పథకం ద్వారా నల్లాల్లో సరఫరా అవుతున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఈ నదీ జలాలను శుద్ధి చేసి నల్లాలతో అందిస్తున్నారు. నది నుంచి సేకరించిన నీళ్లను జిల్లాలోని స్వాములవారి లింగోటం, పానగల్లులలో ప్రత్యేకంగా నెలకొల్పిన ప్లాంట్లలో నాలుగు దశల్లో శుద్ధి చేస్తారు. శుద్ధీకరణ పూర్తయ్యాక ఆ నీళ్లకు పరీక్షలు నిర్వహిస్తారు. పూర్తి స్థాయి నాణ్యత ప్రమాణాల ప్రకారం శుద్ధీకరణ పూర్తయిందని నిర్ధరించుకున్నాక.. ట్యాంకుల్లోకి ఎక్కించి గ్రామాలకు సరఫరా చేస్తారు. గ్రామ పంచాయతీల్లోని నల్లాల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేస్తారు. మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల పరిధిలో 1197 గ్రామాలకు సరఫరా అవుతున్న నీటి శుద్ధీకరణ జరిగే ప్రక్రియను మిషన్ భగీరథ పథకం(గ్రిడ్) చౌటుప్పల్ ఈఈ లక్ష్మీనారాయణ వివరించారు.

మొదటి దశ.. అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (ఏకేబీఆర్) నుంచి కృష్ణా నీటిని నాంపల్లి మండలం స్వాములవారి లింగోటంలోని నీటి



శుద్ధి కేంద్రానికి పంపిస్తారు. ఈ ప్లాంటులో పైపుల ద్వారా నీరు ప్రవహిస్తున్నప్పుడే ప్రీ క్లోరినేషన్ చేసి నీళ్లలో ఏవైనా బ్యాక్టీరియాలు ఉంటే నశింపజేస్తారు. తర్వాత ఏవియేటర్‌లోని నీళ్లను పంపిస్తారు. అక్కడ నీటిని చిలుకుతారు. ఆ ప్రక్రియతో నీటిలోకి ఆక్సీకరణ చేస్తారు. టర్బిడిటీని తొలగిస్తారు.

రెండో దశ.. తొలి దశలో శుద్ధి అయిన లక్ష లీటర్ల నీళ్లకు రెండు గ్రాములు చొప్పున స్ఫటికాలతో కూడిన ఆలం కలుపుతారు. క్లారి ఫ్లోక్యులేటర్ ద్వారా ఈ నీటిని పంపించి శుద్ధి చేస్తారు.

మూడో దశ.. రెండు దశల్లో శుద్ధి చేసిన నీటిని ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్లలోకి పంపిస్తారు. రెండు మీటర్ల ఎత్తుండే ఈ ఫిల్టర్‌లో నాలుగు పొరలుగా గులకరాళ్లు, ఇసుక పేర్చి ఉంటుంది. వీటి ద్వారా వడగట్టిన నీటి టర్బిడిటీ 0–1 ఎన్‌టీయూకు తగ్గుతుంది. నాలుగో దశ.. మూడు దశల్లో శుద్ధి అయిన నీళకు పోస్ట్ క్లోరినేషన్ చేసి సంప్‌లోకి చేరుస్తారు. నాలుగో దశ శుద్ధి తర్వాత ఈ నీళ్లు స్వచ్ఛంగా, తేటగా, రుచిగా, శరీరానికి అవసరమైన అన్ని రకాల పోషకాలతో కూడి ఉంటాయి. శుద్ధి అయిన నీటిని ఉపరితల రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తారు. అక్కడి నుంచి భూమ్యాకర్షణ ద్వారా గ్రామాల్లోని శుభ్రం చేసి క్లోరినేషన్ చేసి ఉన్న ఉపరితల ట్యాంకుల్లో నింపుతారు. అక్కడి నుంచి ఇళ్లలోని నల్లాల ద్వారా ప్రజలకు సరఫరా జరుగుతుంది. పూర్తిస్థాయిలో శుద్ధీకరణ జరిగి, తగినన్ని పోషకాలున్న మిషన్ భగీరథ నీళ్లను ఎలాంటి అనుమాల్లేకుండా తాగవచ్చు.

# కన్నేసి..కాజేసి

కోదాడ : అర్బన్ ప్రాంతాలలోని భూముల ధరలకు గిరాకీ అంతా ఇంతా కాదు. అందులోనూ రహదారికి ఆనుకొని ఉండే భూమికి రూ.కోట్ల వర్షమే కురుస్తుంది. ఇలాంటి భూములపై కన్నేసిన కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్ల అభివృద్ధి పేరుతో వరద కాలువలను సైతం కలిపేసుకుంటున్నారు. ప్రభుత్వం ప్రతి రహదారికి ఇరువైపులా వరద కాలువలను నిర్మాణ దశలోనే ఏర్పాటు చేస్తుంది. హఠాత్తుగా భారీ వర్షాలు వచ్చినా ఈ కాలువల ద్వారా నీళ్లు ప్రవహిస్తుంది. గతేడాది భారీ వర్షాల కారణంగా రహదారులకు ఇరువైపులా కాలువలు లేక వరదలు సంభవించాయి. కోదాడ పట్టణంలో వరదల ధాటికి ఇద్దరు వ్యక్తులు మృత్యువాత పడగా, మండలంలో వేల ఎకరాల పంట కొట్టుకుపోయింది. అయినా అధికారులకు పట్టింపు లేకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నుంచి మేళ్లచెరువు ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా వరద కాలువ కనుమరుగైంది. ఈ ప్రాంతంలో ఎకరం భూమి రూ.కోటి నుంచి రూ.1.5 కోట్ల వరకు ధర పలుకుతుంది. రియల్ వ్యాపారులే కాక కొందరు రైతులు సైతం కాలువను ఆక్రమించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం– సూర్యనారాయణ, ఆర్డీవో కోదాడవరద కాలువలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటాం. రహదారులకు ఇరువైపులా వరద కాలువలు తప్పనిసరిగా ఉండాలి. రైతులకు ఇబ్బందులు లేకుండా వెంచర్ల యజమానులు నిబంధనలు పాటించాలి.

# తవ్వేకొద్దీ అక్రమాలు!

పాల్వంచ : పాల్వంచకు అతి సమీపంలోని ముర్రేడు, కిన్నెరసాని నదుల నుంచి ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. పాల్వంచ పట్టణంలోని కుంటినాగులగూడెం, శ్రీనివాసకాలనీ, మంచికంటినగర్, శివనగర్, విద్యుత్ ఎంప్లారస్ కాలనీ, కేఎల్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంతం, బసవతారకకాలనీ, జగన్నాథపురం, లక్ష్మీదేవిపల్లిలో వందలాది సంఖ్యలో నూతన భవనాలు, వ్యాపార సముదాయాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.కొందరు బిల్డర్లు, భవన నిర్మాణ యజమానులు.. తోగ్గూడెం సమీపంలోని ముర్రేడు వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఒడ్డుకు ఇసుకను రాత్రిపూట డంప్ చేసి లారీల్లో పాల్వంచకు తరలిస్తూ రూ.లక్షలు గడిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంగం, రంగాపురం, నాగారం వద్ద కిన్నెరసాని నది, పాత పాల్వంచలో ముర్రేడు నది నుంచి రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది.

**పట్టించుకోని యంత్రాంగం**

తోగ్గూడెం కేంద్రంగా ఇసుక డంప్ చేసి అక్రమంగా తరలిస్తున్నా పోలీసు, రెవెన్యూ, మైనింగ్, అటవీశాఖ అధికారులు పట్టించుకోవటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు, రెవెన్యూ అధికారులు తూతూమంత్రంగా ఒకట్రెండు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నదుల నుంచి ఇసుకను టన్నుల కొద్దీ తరలించటం వల్ల భూగర్భజలాలు ఇంకిపోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ, మైనింగ్, అటవీ, చెక్‌పోస్ట్ అధికారులు పకడ్బందీగా తనిఖీలు చేపడుతూ ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

పోలీసు, మైనింగ్ అధికారుల సహకారంతో అక్రమ మైనింగ్‌పై ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నాం. ఇసుక అక్రమ రవాణాపై తరచూ కేసులు నమోదుచేస్తున్నాం. స్వాధీనపరచుకున్న ఇసుకకు పలుమార్లు బహిరంగ వేలం నిర్వహించాం.వివేక్, తహసీల్దారు, పాల్వంచ

# ఊరూరా ఉపాధి జోరు



పెద్దపల్లి : ఉమ్మడి జిల్లాలో ఉపాధిహామీ పనులు ఊపందుకున్నాయి. వ్యవసాయ పనులు లేకపోవడంతో ఎక్కువ మంది కూలీలు పథకాన్ని వినియోగించుకుంటున్నారు. ఎండలు పెరుగుతున్నా రోజురోజుకూ కూలీల సంఖ్య పెరుగుతోంది. కాగా పని ప్రదేశాల్లో కనీస వసతులు కరవయ్యాయి. ఉపాధిహామీలో చెరువులు, కుంటలు, కాలువల్లో పూడికతీత పనులు చేపడుతుండగా కూలీలు ఉత్సాహంగా భాగస్వాములవుతున్నారు. నేల గట్టిగా ఉండటంతో వేతనం గిట్టుబాటు కావడం లేదని కూలీలు వాపోతున్నారు.

**ఉమ్మడి జిల్లాలో 1.26 కోట్ల పని దినాలు**

ఉమ్మడి జిల్లాలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జగిత్యాల జిల్లాలో 37.82 లక్షలు, కరీంనగర్ 28.56 లక్షలు, పెద్దపల్లి 32.89 లక్షలు, సిరిసిల్ల 26.75 లక్షలు కలిపి మొత్తం 1.26 కోట్ల పని దినాలను లక్ష్యంగా విధించారు.

యాసంగి వరి కోతలకు యంత్రాలు వినియోగిస్తుండటంతో వ్యవసాయ పనులు లేక కూలీలు ఉపాధిహామీ పనులకు మొగ్గు చూపుతున్నారు. కోరిన ప్రతి కూలీకీ పని కల్పిస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనుల కంటే ఉపాధిహామీ పనులకే మహిళలు ప్రాధాన్యమిస్తున్నారు. చెరువులు, కాలువల్లో పూడికతీత, మట్టి రహదారుల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

**గిట్టుబాటు కాని వేతనం**

ఉమ్మడి జిల్లా పరిధిలో 9.47 లక్షల జాబ్‌కార్డులున్నాయి. రోజుకు సగటున 60 వేల మంది పనులకు హాజరవుతున్నారు. పని ప్రదేశాల్లో నీడ, ప్రథమ చికిత్స కిట్లు, ఇతర వసతులు కల్పించడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. నీడ లేకపోవడంతో చెట్లు, పొదల నీడలో సేద తీరుతున్నారు. పంచాయతీల ఆధ్వర్యంలోనే కూలీలకు తాగునీరు కల్పించాల్సి ఉంది. అక్కడక్కడ అరకొరగా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. డ్రమ్ములు, క్యాన్లలో నీరు సరఫరా చేస్తుండగా ఎండలకు వేడెక్కడంతో తాగేందుకు కూలీలు వెనుకాడుతున్నారు. నిబంధనల మేరకు పని చేసిన కూలీలకు రోజుకు రూ.307 చెల్లించాల్సి ఉంది. నేల స్వభావం గట్టిగా మారడంతో రూ.250లోపే గిట్టుబాటవుతోందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఇలా చేస్తే మేలు**

రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు సమకూర్చాలి.

పని ప్రదేశాల్లో ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంటే ప్రమాదవశాత్తు గాయపడిన కూలీలకు చికిత్స అందుతుంది.

తాగునీటిని క్యాన్లలో కాకుండా కుండల ద్వారా సరఫరా చేయాలి.

పని ప్రదేశాల్లో నీడ కోసం టెంటు, పందిరి వేయాలి.

# ప్రమాదాల నివారణకు కార్యాచరణ



చేగుంట : రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారిపై అండర్‌పాస్‌ల నిర్మాణానికి కేంద్రం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా నార్సింగి మండలం వల్లూరు, రామాయంపేట మండలం కోమటిపల్లి జంక్షన్ల వద్ద అండర్‌పాస్‌లను మంజూరు చేసింది. ఇక్కడ రూ.40 కోట్లతో వీటి నిర్మాణం చేపట్టనుంది.

జిల్లాలో మనోహరాబాద్ మండలం కాళ్లకల్ నుంచి రామాయంపేట మండలం దామరచెరువు వరకు మొత్తం 55 కిలోమీటర్లు 44వ జాతీయ రహదారి విస్తరించి ఉంది. మధ్యలో తూప్రాన్, మాసాయిపేట, చేగుంట, నార్సింగి మండలాలుంటాయి. ఇప్పటికే తూప్రాన్ సమీపంలోని నాగులపల్లి, కరీంగూడ, చేగుంట, జప్తిశివునూర్ వద్ద పైవంతెనల నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. గతంలో వీటి వద్ద ప్రమాదాలు జరిగి ఎంతోమంది మృత్యువాత పడ్డారు. ప్రమాదాల నివారణకు వంతెన నిర్మించి సమస్య లేకుండా చేశారు.

**3.45 కిలోమీటర్ల మేర.. :** రాష్ట్రంలో జాతీయ రహదారి 44, 163, 65 పరిధిలో మొత్తం 28.97 కిలోమీటర్ల మేర రూ.825 కోట్లతో కొత్త వంతెనలు, అండర్‌పాస్‌లు, సర్వీసు రోడ్లు నిర్మించేందుకు కేంద్రం సన్నద్ధమవుతోంది. మే 5న కేంద్ర మంత్రులు శంకుస్థాపన చేయనున్నారు. ఇందులో భాగంగా వల్లూరు, కోమటిపల్లి వద్ద సుమారు రూ.40 కోట్లతో 3.45 కిలోమీటర్ల మేర ఆరువరుసల అండర్‌పాస్‌ల నిర్మాణం చేపట్టనున్నారు. ఏడాదిలో వీటి నిర్మాణం చేపట్టి పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. నిధులు మంజూరు కావటంవల్ల పనులు వేగంగా జరిగే అవకాశం ఉంటుంది. వల్లూరు గ్రామస్థుల దశాబ్దాల కల నెరవేరనుంది. భవిష్యత్తులో కాళ్లకల్ నుంచి జాతీయ రహదారి ఆరు వరుసలుగా రోడ్డు నిర్మాణం జరిగే అవకాశం ఉంది. ఇందులో భాగంగా ఈ పాటికే వంతెనలపై ఆరు వరుసల రహదారి నిర్మాణం చేపట్టారు. ఇప్పుడు అండర్‌పాస్‌లు ఆరు వరుసలుగా నిర్మించనున్నారు. చేగుంట మండలం వడియారం బైపాస్ సర్కిల్ వద్ద వంతెన మంజూరు చేస్తే ఇక సమస్య దూరం కానుంది.

**వల్లూరు వద్ద..:** జాతీయ రహదారిపై వల్లూరు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. 1996 ఆగస్టు 16న జరిగిన ప్రమాదంలో 29 మంది మరణించారు. జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించాక, వల్లూరుతో పాటు కోమటిపల్లి వద్ద రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రెండుచోట్ల వంతెనల నిర్మాణాలను చేపట్టాలని ప్రజలు ఎప్పటినుంచో కోరుతున్నారు. ఇప్పుడు వాటికి మోక్షం లభించనుంది. ఈ రెండు చోట్ల రోడ్డు దాటాలంటే అవస్థలు తప్పవు.

# మండుతున్న ఎండలు.. తగ్గుతున్న నీటి నిల్వలు

సిరిసిల్ల : రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. భానుడి ప్రతాపానికి జలాశయంలోనూ నీటి నిల్వలు వేగంగా తగ్గుతున్నాయి. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాలతోపాటు మానకొండూరు నియోజకవర్గంలోని ఇల్లంతకుంట మండలానికి మధ్యమానేరు జలాశయం నుంచే తాగు, సాగునీరు అందుతుంది. ప్రస్తుతం జలాశయంలో 7 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఈ సమయానికి 5.8 టీఎంసీలు ఉంది. ఇప్పుడున్న నిల్వలో నుంచి దిగువ మానేరుకు 2 టీఎంసీలు తరలించే అవకాశం ఉంది. రాబోయే రెండు నెలలు తాగునీటి అవసరాలకు ఈ నీరే కీలకం. ఆవిరిరూపంలో 1.5 టీఎంసీలు వెళ్లినా.. ఇంకా 3.5 టీఎంసీలు ఉండే అవకాశం ఉంది. జలాశయం సమీపంలోని ఇంటేక్ వెల్ నుంచి అగ్రహారంలోని నీటి శుద్ధి కేంద్రానికి నిత్యం 45 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఇక్కడ నీరు శుద్ధి అయిన తర్వాత గ్రామాలకు సరఫరా అవుతోంది.

**మోటార్లపై ఒత్తిడి**

జలాశయంలో నీటి నిల్వలు తగ్గుతున్న కొద్దీ నీటి శుద్ధి చేసే గ్రిడ్‌లోని మోటార్లపై ఒత్తిడి పెరుగుతుంది. దీనికితోడు గ్రామాల్లో ప్రత్యామ్నాయంగా వినియోగించే పాత తాగునీటి పథకాల్లోనూ భూగర్భజలాలు అడుగంటే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే 140 ఎంఎల్‌డీల సామర్థ్యం ఉన్న నీటి శుద్ధి కేంద్రంలో 90 ఎంఎల్‌డీలు మాత్రమే శుద్ధి చేస్తున్నారు. జలాశయంలో నీటి నిల్వలు కనిష్ఠస్థాయికి చేరుకుంటే శివారు గ్రామాలకు నీరందని పరిస్థితులు నెలకొనే అవకాశం ఉంది. ఇప్పటికే చొప్పదండి నియోజకవర్గంలో 20 శాతం



గ్రామాలకు పూర్తి స్థాయిలో నీరందడంలేదు. సిరిసిల్ల పురపాలికకు 16 ఎంఎల్‌డీల నీరు అవసరం కాగా ఇందులో 12 ఎంఎల్‌డీలు మాత్రమే వస్తుంది. దీంతో విలీన గ్రామాల్లో పాత పథకాలనే వినియోగిస్తున్నారు. వేములవాడ పురపాలికలోని చాలా కాలనీల్లో పాత పథకాలతోనే సరఫరా చేస్తున్నారు. ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాలకు నీటిని సరఫరా చేసే సంపు దమ్మన్నపేటలో ఉంది. ఇందులో పూర్తిస్థాయిలో నీటినిల్వలేక గ్రిడ్ పైపులైనుకు ప్రెషర్ అందడంలేదు. దీంతో శివారు గ్రామాలకు అరకొరగా నీటి సరఫరా జరుగుతోంది. గ్రిడ్ నుంచి ఇంట్రావిలేజ్‌లోని పాత పైపులైన్లకు లీకేజీల సమస్యను పరిష్కరిస్తే ఈ వేసవిలో నీటి ఎద్దడిని నివారించవచ్చని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్..!

నల్గొండ : రిజిస్ట్రేషన్ల క్రయ విక్రయాలు ఇక నుంచి స్లాట్ బుకింగ్ ద్వారా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వ స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖపై తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో మార్పు వచ్చే అవకాశం కనిపిస్తుంది. ప్రస్తుతం ఉన్న 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ నెల 10 నుంచి భువనగిరి, చౌటుప్పల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. మిగిలిన 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో త్వరలో స్లాట్ బుకింగ్ ద్వారా పునర్ వ్యవస్థీకరణ చేయడానికి ప్రభుత్వం ఇప్పటికే పూర్తి స్థాయిల్లో కసరత్తు ప్రారంభించింది. ఈ విధానం ద్వారా ఇకపై నిషేధిత జాబితాలో ఉన్న ఆస్తులను ఎట్టి పరిస్థితుల్లో క్రయ విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. భూ భారతి తరహాలో ప్రత్యేకంగా ఒక పోర్టల్ ఏర్పాటు చేసి నిషేధిత ఆస్తుల వివరాలను అందులో పొందుపరచనున్నారు. ఒక వేళ రిజిస్ట్రేషన్ చేయడానికి ప్రయత్నించినా క్షణాల్లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ ప్రధాన కార్యాలయానికి సమాచారం అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

**కొత్త విధానంతో..**

నూతనంగా స్లాట్ బుకింగ్ విధానంతో రిజిస్ట్రేషన్లు సులభతరం కానున్నాయి. ఉదయం 10:30 నుంచి 1:30 వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు. స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్లను స్కాన్ చేసి అదే రోజు సంబంధిత ఆస్తి కొనుగోలు దారుకు ఇస్తారు. పారదర్శకంగా, వేగవంతంగా స్లాట్ బుకింగ్ ఉపయోగించుకునేలా యంత్రాంగం




ఏర్పాట్లు చేస్తుంది.

**అక్రమాలకు అడ్డుకట్ట పడేనా..?**

జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా చేసే క్రయ విక్రయాలకు గజానికి రూ.150 నుంచి రూ.200 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నా.. కార్యాలయ ఖర్చులు అంటూ ఖాళీ ప్లాట్ రిజిస్ట్రేషన్ చేస్తే రూ.2 వేలు, ఇల్లు రిజిస్ట్రేషన్ చేస్తే రూ.3 నుంచి రూ.4 వేలు వసూలు చేస్తున్నారని పేరు చెప్పడానికి ఇష్టపడని దస్తావేజు లేఖరు 'న్యూస్‌టుడే'తో వాపోయాడు.

**పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు**

జిల్లాలో పారదర్శకంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నాం. నేటి నుంచి చౌటుప్పల్, భువనగిరిలో స్లాట్ బుకింగ్ అందుబాటులోకి వస్తుంది. ఒక్కో కార్యాలయానికి ఉదయం 48 స్లాట్ బుకింగ్‌లు, సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య ఐదు మాత్రమే నేరుగా రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం ఉంది. మధ్యవర్తుల ద్వారా గజానికి రేటు కట్టి వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. ఎక్కడ అక్రమ వసూలు జరిగినా నేరుగా డీఆర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయొచ్చు. ప్రకాశ్, ఉమ్మడి జిల్లా

# మిల్లుల దారుల్లో.. సన్నాల బారులు

మిర్యాలగూడ : నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతంలోని నల్గొండ, సూర్యాపేట జిల్లాలో ఈ సీజన్‌లో సన్నరకం ధాన్యాన్ని అధికంగా సాగు చేశారు. అయితే సన్నరకం ధాన్యాన్ని విక్రయించేందుకు ఆయా జిల్లాల్లోని రైతులు అధిక మంది మిర్యాలగూడలోని రైస్ మిల్లుల వద్దకు తరలివస్తున్నారు. దీంతో మిర్యాలగూడ ప్రాంతంలోని యాద్గార్‌పల్లి, గూడూరు, శెట్టిపాలెం, వెంకటాద్రిపాలెం సమీపంలోని మిల్లులకు సన్న ధాన్యం ట్రాక్టర్లు పోటెత్తుతున్నాయి. ముఖ్యంగా యాద్గార్‌పల్లి రోడ్డులోని మిల్లుల ఎదుట భారీగా ధాన్యం లోడ్లు నిలిచిపోతుండడంతో తరచూ ట్రాఫిక్ నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సన్నరకం ధాన్యంలో జేఎస్ఆర్ చింట్లు రకానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ధాన్యం మొత్తం ఒకే సారి విక్రయానికి రావడంతో మిల్లర్లు నాణ్యత సాకుతో ధరలో కోత విధిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర రూ.2,320 సైతం వేయకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చింట్లు రకానికి పలువురు మిల్లర్లు రూ.2,150 నుంచి రూ.2,250 వరకు మాత్రమే చెల్లిస్తున్నారని, గతంలో ఇదే ధాన్యానికి రూ.2,800 వరకు ధర ఇచ్చారని దీంతో పోల్చితే భారీగా నష్టపోతున్నామని అన్నదాతలు చెప్తున్నారు.

ప్రత్యేక అధికారులను నియమించినా..

మిల్లుల వద్ద రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా వారికి మద్దతు ధర దక్కేలా ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించేందుకు సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ ప్రతి మిల్లుకు ఒక ప్రత్యేక అధికారిని మంగళవారం నియమించారు. అయినప్పటికీ ం రైతులకు మద్దతు ధర ఎక్కడా లభించకపోవడం గమనార్హం.

**గంటల తరబడి ఎదురుచూపులే..**

మిల్లుల వద్దకు సాయంత్రం సమయంలో వచ్చిన ధానాన్ని సైతం మిల్లర్లు మరుసటి రోజు మధ్యాహ్నం వరకు కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సూర్యాపేట జిల్లాలోని పెన్‌పహాడ్, మునగాల, నడిగూడెం, నేరేడుచర్ల, చిలుకూరు తదితర మండలాల నుంచి అనేక మంది రైతులు తెల్లవారుజామున నాలుగు గంటలకే మిల్లుల వద్ద లైన్లలో ట్రాక్టర్లను ఉంచి పడిగాపులు గాస్తున్నారు. అనేక మంది అలసిపోయి ట్రాక్టర్ల పైనే నిద్రిస్తూ తమ వంతు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఐకేపీ కేంద్రాల్లో కొనట్లేదు

ప్రభుత్వం సన్నాలు సాగు చేయాలని ప్రోత్సహించడంతో సాగు చేశాం. అయితే ఐకేపీ కేంద్రాల్లో సన్న ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో మిర్యాలగూడలోని మిల్లుల వద్దకు వచ్చాను. వరి కోసి తెల్లవారుజామున నాలుగు గంటలకు తీసుకొచ్చాను. చింట్లు రకానికి గతంలో ధర బాగానే పలికింది. కానీ ప్రస్తుతం మద్దతు ధర సైతం అందించకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. కీత శ్రీను, మఠ్రికుంట, గరిడేపల్లి మండలం, సూర్యాపేట జిల్లా.

# అమ్మ చేతికిస్తే నిమ్మ.. లాభాల కొమ్మే..!

నకిరేకల్ : మహిళా శక్తి పథకం ద్వారా రాష్ట్రంలో పెద్దఎత్తున ఆహారశుద్ధి యూనిట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మహిళా స్వయం సహాయక పొదుపు సంఘాల ఆధ్వర్యంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) సహకారంతో వీటిని నెలకొల్పేందుకు ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాల వారీగా అందుబాటులో ఉన్న పంట ఉత్పత్తులను గుర్తించి స్థానిక మహిళా పొదుపు సంఘాలతో వాటి శుద్ధికోసం పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఉమ్మడి జిల్లాకు సంబంధించి నల్గొండ జిల్లాలో బత్తాయి, సూర్యాపేట జిల్లాలో కూరగాయలు, పాలు, యాదాద్రి భువనగిరి జిల్లాలో పాడి ఉత్పత్తుల పరిశ్రమల ఏర్పాటును తాజాగా ప్రతిపాదించారు. నల్గొండ జిల్లాలో బత్తాయితోపాటు నిమ్మ ఆహార శుద్ధి యూనిట్లను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాలో బత్తాయి తర్వాత నిమ్మసాగే అధికం. రాష్ట్రంలో 90 శాతం



నిమ్మ ఉమ్మడి జిల్లాలోనే సాగవుతోంది. నిమ్మ దిగుబడుల ద్వారా ఏటా రూ.కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయి. నిమ్మ, బత్తాయిల ప్రాధాన్యం గుర్తించిన ప్రభుత్వం రాష్ట్రంలోనే ప్రథమంగా నల్గొండ జిల్లాలో నిమ్మ, బత్తాయి మార్కెట్లను నెలకొల్పింది. నకిరేకల్‌లోని నిమ్మ మార్కెట్ మాత్రమే విజయవంతంగా పనిచేస్తోంది. మార్కెట్ల మాదిరిగానే బత్తాయి, నిమ్మ ఆహార శుద్ధి యూనిట్లను జిల్లాలో నెలకొల్పాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిమ్మ దిగుబడుల్లో ఉమ్మడి నల్గొండ జిల్లా అగ్రస్థానంలో ఉంది. 20 వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో నిమ్మతోటలు సాగవుతున్నాయి. 17వేలకు పైగా రైతు కుటుంబాలకు నిమ్మసాగే ప్రధాన ఆధారం. వాతావరణం అనుకూలిస్తే ఏటా 2.50 లక్షల టన్నులకుపైగా నిమ్మకాయల దిగుబడులు వస్తాయి. మధ్యదళారులు, వ్యాపారుల మాయాజాలంతో సరైన ధర అందక నిమ్మ రైతులు నష్టపోతున్నారు. ఏటా లక్షల టన్నుల నిమ్మ దిగుబడులు వస్తున్న ఉమ్మడి జిల్లాలో.. ప్రధానంగా నకిరేకల్ ప్రాంతంలో ఈ పరిశ్రమలు ఏర్పాటుచేస్తే రైతులకు భరోసా ఉంటుంది.

నిమ్మ సాగు ఇలా.. (ఎకరాలలో)

నల్గొండ: 8999

సూర్యాపేట: 8200

యాదాద్రి: 5020

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

– వేముల వీరేశం, ఎమ్మెల్యే

మహిళా శక్తి పథకంలో నిమ్మకు ప్రాధాన్యం కల్పించి ఈ ప్రాంతంలో ఆహార శుద్ధి యూనిట్ల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రత్యేకంగా విన్నవిస్తాను. నిమ్మ పరిశ్రమల ఏర్పాటుకు మన ప్రాంతంలో ఉన్న అవకాశాలను సీఎంకు, వ్యవసాయశాఖ మంత్రికి చెబుతాను. యూనిట్ల ఏర్పాటుకు నా వంతు కృషిచేస్తా.

# ముంచుతోందని మూసేశారు..!

మోత్కూరు : రైతులకు లాభాలు తెచ్చిపెడుతుందని సింగిల్ విండో ఆధ్వర్యంలో ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేసిన పెట్రోల్‌బంక్ నష్టాల్లో ముంచుతోంది. మోత్కూరు నాగార్జున రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో 2018లో మండలంలోని తొర్రూరు–వలిగొండ రోడ్డుకు అనాజిపురం–దత్తప్పగూడెం మధ్యన రూ.20 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేశారు. నష్టాలు రావడంతో మూడేళ్ల కిందట మూసేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆయిల్ కంపెనీలతో ప్రత్యేక ఒప్పందం ప్రకారం రైతులకు డీజిల్, పెట్రోల్‌ను తక్కువ ధరలకు అందివ్వాలన్న లక్ష్యంతో ఉమ్మడి నల్గొండ జిల్లాలో పలు బంక్‌లను ఏర్పాటు చేశారు. రైతుల కోసం ఆయిల్ కంపెనీల ప్రత్యేకంగా తక్కువ ధరలకు పెట్రోల్, డీజిల్ సరఫరా చేయకపోవడం, నిర్వహణ లోపంతో వరుసగా నష్టాలు చవిచూసింది. మధ్యలో కొంతకాలం మూతపడింది. మళ్లీ రూ.10 లక్షలు పెట్టుబడి పెట్టి పునఃప్రారంభించినా నష్టాలు రావడంతో మూసివేయక తప్పలేదు.

బంక్ ఏర్పాటుకు 25 ఏళ్ల కాలపరిమితితో దత్తప్పగూడెం గ్రామ రైతు వద్ద స్థలం లీజుకు తీసుకున్నారు. స్థలం అద్దెగా ప్రతీనెలా రూ.10 వేలు చెల్లిస్తున్నారు. నిర్వహణకు ఉద్యోగిని నియమించుకుని రూ.10 వేల వేతనం ఇస్తున్నారు. బంక్ నడవకున్నా నెలకు రూ.20 వేలు సింగిల్‌విండో నుంచి చెల్లించాల్సి వస్తోంది. దీంతో జనవరి నెలలో ఉద్యోగిని మాన్పించారు. అయినా భూమికి అద్దె మాత్రం చెల్లించక తప్పడం లేదు.



**రూ.1 1.50 లక్షల విలువైన ఇంధనం నిల్వలు**

ప్రస్తుతం ఈ బంక్‌లో రూ.11.50 లక్షల విలువైన డీజిల్, పెట్రోల్ నిల్వ ఉంది. దీన్ని అమ్మేందుకు జిల్లా కలెక్టర్, డీసీవో అనుమతులు తీసుకొని, అమ్ముకోవాల్సి ఉంది. సీసీ కెమెరాలు, బంక్‌లోని బ్యాటరీలు చోరీకి గురవడంతో బంక్ వద్ద రక్షణ లేకుండా పోయింది.

**బంక్ ఏర్పాటుతో అంతా నష్టమే**

పేలపూడి వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ ఛైర్మన్

బంక్ ద్వారా అంతా నష్టమే వచ్చింది. ఈ పెట్టుబడి ఇతర వ్యాపారాల మీద పెడితే లాభాలు వచ్చేవి. గత పాలకవర్గం అవగాహన రాహిత్యంతో ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారులు, పాలకవర్గం నిర్ణయాల మేరకు చర్యలు తీసుకుంటాం.

# ఏడేళ్లుగా అదే కూలీ



సిరిసిల్ల: ఆటుపోట్లను ఎదుర్కొంటున్న జిల్లా వస్త్ర పరిశ్రమలో మరో సమస్య వచ్చిపడింది. కార్మికుల కూలీరేట్ల పెంపుపై మూడురోజులుగా సమ్మె జరుగుతోంది. ప్రైవేటు ఆర్డర్లతోపాటు ప్రభుత్వం కొత్తగా ఇచ్చిన మహిళా సంఘాల చీరలకు కూలీరేట్లు నిర్ణయించాలని డిమాండ్ చేస్తున్నారు. గురువారం సమ్మెచేస్తున్న కార్మిక సంఘాల నాయకులను అరెస్టుచేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాస్తవానికి ప్రైవేటు ఉత్పత్తులపై 2024 ఏప్రిల్‌లోనే కూలీ రేట్ల ఒప్పందం ముగిసింది. అయినా ఏడాదిగా యజమానుల నుంచి స్పందనలేదు. ఇటీవల వస్త్రోత్పత్తుల్లో నష్టం వస్తుందని పెద్ద, చిన్న పన్నాలకు కలిపి మూడు పైసల చొప్పున కూలీ తగ్గించారు. ఇదిలా ఉంటే.. ప్రభుత్వ ఆర్డర్ల పంపిణీకి ముందే టెస్కో సేకరణ ధర, కార్మికులకు ఇచ్చే కూలీరేట్ల నిర్ణయం జరుగుతుంది. ఈసారి అవేమీ లేకుండానే వస్త్రోత్పత్తులు ప్రారంభించారు. ఇప్పటికే విద్యుత్తు సమస్యతో ఎస్‌ఎస్‌ఐ యూనిట్లను మూసివేయగా... మ్యాక్స్ సంఘాల్లో కార్మికుల కూలీ రేట్లతో సమ్మెబాట పట్టారు. పరిష్కారం లభించకపోతే రెక్కాడితే గాని డొక్కాడని కార్మికుల కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులు తప్పవనే ఆందోళన నెలకొంది.

**అటకెక్కిన ఒప్పందం** జిల్లా వస్త్ర పరిశ్రమలో 30వేల మరమగ్గాలపై ప్రత్యక్షంగా పరోక్షంగా 20వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. పరిశ్రమలో ప్రతీ రెండేళ్లకోసారి కూలీ రేట్లు పెంచుతారు. 33 ఏళ్లుగా ఇది అనవాయితీగా వస్తుంది. తొలుత 1992లో పది పిక్కులకు పాలిస్టర్ వస్త్రం ఉత్పత్తి కూలీ 8 పైసల నుంచి ప్రారంభమైంది. అలా 2018లో చిన్నపన్నాకు 22.50 పైసలు, పెద్దపన్నాకు 23.50 పైసలు. కాటన్‌లో చిన్నపన్నా 40 పైసలు, పెద్దపన్నా 45 పైసలు చేశారు. వార్పిన్‌లకు వెయ్యిపోగులకు గాను రూ.32, వైపని వారికి రూ.88గా ధర నిర్ణయించారు. ఏడేళ్లుగా ఇవే ధరలు కొనసాగుతున్నాయి.

**కార్మికులు కోరుతున్నది ఇదీ..**

ఏడేళ్లుగా కూలీ రేట్లు పెరగడంలేదు. ఈ సారి పది పిక్కులకు చిన్నపన్నా 25పైసలు, పెద్దపన్నా 26 పైసలు పెంచాలని కార్మికులు కోరుతున్నారు. 2023లో ఉత్పత్తి చేసిన బతుకమ్మ చీరలకు సంబంధించి కార్మికులకు రావాల్సిన పదిశాతం రాయితీని ప్రభుత్వం విడుదల చేయాలని కోరుతున్నారు. బతుకమ్మ చీరల ఉత్పత్తికి మీటరుకు రూ.5.25తో పాటు నూలు రాయితీ కింద మరో రూ.1.42 చెల్లించారు. ప్రస్తుతం మహిళా సంఘాల చీరల ఉత్పత్తికి ముందే కూలీధర నిర్ణయించి, నూలు రాయితీ చెల్లింపులను కొనసాగించాలని కోరుతున్నారు.

**రూ.వెయ్యి చెల్లించాలి**

వస్త్రపరిశ్రమలోని కార్మికులకు ఏడాదిగా పనిలేదని పోరాటం చేస్తే ప్రభుత్వం మహిళా సంఘాల చీరల ఆర్డర్లు ఇచ్చింది. వీటి ఉత్పత్తిపై అధికారులు యజమానులు, ఆసాములతో కలిసి మాట్లాడారు. కార్మికుల కూలీరేట్ల విషయమై మాట్లాడలేదు. చీరలు ఉత్పత్తిచేసే కార్మికులకు రోజు కూలీ రూ.వెయ్యి ఇవ్వాలని కోరుతున్నాం.

ఎగమంటి ఎల్లారెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

# పేరుకుపోతున్న పూడిక



జగిత్యాల : ఉమ్మడి జిల్లాకు ప్రధాన నీటివనరైన శ్రీరామసాగర్ జలాశయంలో పూడిక పేరుకుపోయి గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం ఏటికేడు తగ్గుతోంది. 112 టీఎంసీల సామర్థ్యంగల ఎస్సారెస్పీలో నిరుటివరకు 90.313 టీఎంసీల నీటిని నిల్వచేయగా పూడిక పేరుకుపోయి నిరుటి నుంచి నీటినిల్వ 80.501 టీఎంసీలకు తగ్గిపోయింది. ఈ ప్రభావం ఉమ్మడి జిల్లాపై అధికంగా పడనుంది. రాష్ట్రప్రభుత్వం పలు ప్రాజెక్టుల్లో పూడికతీతను చేపట్టగా ఎస్సారెస్పీలోని పూడికను కూడా తొలగించేలా చర్యలు చేపట్టాల్సి ఉంది. దీంతోపాటు అన్ని చెక్‌డ్యాంలు, రోళ్లవాగు తదితర ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి, మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టుల్లో నీటినిల్వ, కాలువల నిర్మాణాలకు మరమ్మతు, చెరువుల్లోకి ప్రాజెక్టులనీటిని తరలించే అనుసంధాన కాలువలు, పైపులైన్ల నిర్మాణం తదితరాలకు వేసవిలోనే చర్యలు చేపడితే వానాకాలం వరకు జిల్లాకు సాగునీటి సుస్థిరత ఏర్పడుతుంది.

ఒక ఏడాదిలో సరాసరిగా 80–104 గంటల వాన మాత్రమే కురుస్తుండగా ఈ వర్షపు నీటిని ఒడిసి పట్టుకొని ఏడాది పొడవునా వినియోగించుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి వర్షపునీటి వినియోగం 10–17 శాతం మాత్రమేకాగా ఇది మరో 12 శాతం పెంచగలిగితే సాగు, తాగునీటి సమస్యలు తీరతాయని నిపుణుల అంచనా. వర్షపాతంలో దాదాపు 40–51 శాతం వరకు భూమిలోకి ఇంకకుండా పొలం బయటకు వృథాగా పోతోంది. వర్షపునీటితో నేల పైపొరల్లో విలువైన పోషకాలతో కూడిన మట్టి కొట్టుకుపోతుంది. కాంటూరు సేద్యాన్ని అనుసరించాలి. తోటల్లో వాలుకు అడ్డంగా మట్టికట్టల ద్వారా వర్షపునీరు నిల్వఉండి నేలలోనే ఇంకేలా చేయవచ్చు. వ్యవసాయ బావులను రీఛార్జిచేసేలా బావికి సమీపంలో గుంతనుతవ్వి వృథానీటిని మళ్లించాలి. ఉపాధిహామీ ద్వారా పర్కులేషన్ ట్యాంకులతో పాటు కాంటూరు కందకాలను పెద్దఎత్తున తవ్వి వర్షపునీటిని నేలలోకి ఇంకేలా చేయటం సత్ఫలితాలిస్తోంది. వ్యవసాయంలో నీటివినియోగ సామర్థ్యం 20–45 శాతం ఉండగా బిందు, తుంపర్ల సేద్యంతో 69–90 శాతం వరకు పెంచేవీలుండగా ఈ పరికరాలను ప్రభుత్వం రాయితీపై ఇవ్వాలి. మన తలసరి నీటి లభ్యత 1400 క్యూబిక్ మీటర్లుగా ఉంటే వాడకం 801 క్యూబిక్ మీటర్లు మాత్రమే.

గత వానాకాలంలో ఎస్సారెస్పీలోకి 287 టీఎంసీల వరదనీరు రాగా నిల్వసామర్థ్యం లేనందున దాదాపు 140 టీఎంసీలకుపైగా నీటిని మిగులు జలాలుగా గోదావరిలోకి వదలాల్సి వచ్చింది. మన జిల్లాలోనూ సాధారణం కన్నా 21 శాతం అధిక వర్షపాతం నమోదైనా దాదాపు 32 టీఎంసీలకుపైగా వరదనీరు వృథాగా దిగువకు వెళ్లిపోయింది. అధిక వర్షం కురిసిన సందర్భాల్లో వరదతో ఇబ్బందులు తలెత్తినా ఏడాది పొడవునా అన్నింటికీ ఆధారమైన వర్షపునీటి సంరక్షణ, సుస్థిర వినియోగం అత్యంత అవశ్యంగా మారింది. 14.33 లక్షల ఎకరాల సాగులో 8.71 లక్షల ఎకరాల పైర్లకు వర్షపునీటితో ఉబికివచ్చే భూగర్భ జలాలే ప్రధాన నీటివనరుగా ఉండటం వాననీటి ప్రాధాన్యతను కళ్లకు కడుతోంది.

# ఆకాశంలో మబ్బులు.. గుండెల్లో గుబులు

సూర్యాపేట : ఆకాశం మేఘావృతమై వర్ష సూచనలు కన్పించడం అన్నదాతలను దడపుట్టిస్తోంది. అత్యధికం వరి పంటలు కోతకు వచ్చాయి. మరోవైపు మామిడి కాయలు చేతికి రానున్నాయి. కల్లాల్లో మిరప రాశులు ఆరబోశారు. ఎండల నుంచి జనం కొంత ఉపశమనం లభించినా రైతుల్లో మాత్రం ఆందోళన మొదలైంది. పలు ప్రాంతాల్లో జల్లులకు కురుస్తుండటం కలవరపెడుతోంది.

ఎస్సారెస్పీ కాల్వల్లో నీరు వదలక, భూగర్భ జలాలు అడుగంటి బోరుబావులు వట్టిపోయి, చీడపీడలతో చాలా వరకు పంటలు ఎండిపోయాయి. ఉన్న కాస్త పంట కోతలు చేపట్టాలనుకుంటున్న రైతుల ఆశలు వాన ముంచెత్తే ప్రమాదముంది. మామిడి రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. గాలిదుమారం, వడగళ్ల వర్షం కురిస్తే మామిడి కాయలు, వరి ధాన్యం నేలరాలి తీవ్రనష్టం చేకూరే ప్రమాదముందని ఆవేదన చెందుతున్నారు. మిరప ధరలేక కల్లాల్లో నిల్వచేసి ఉంచారు. మిరపకాయలు తడిస్తే నాణ్యత చెడిపోతుంది. టార్పాలిన్‌లు కప్పేందుకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

**వరికి పెద్ద ముప్పు**

జిల్లాలో యాసంగి వరి కోతలు ప్రారంభమయ్యాయి. చిన్నపాటి గాలి



వీచినా వెదజల్లడం, డ్రమ్ సీడర్ ద్వారా చేపట్టిన సాగు నేలవాలే ప్రమాదం ఎక్కువగా ఉంది. దీంతో పంట కోసేందుకు కష్టతరంగా మారి, గింజలు రాలి తీవ్రంగా నష్టం చేకూరే అవకాశం ఉంది. ప్రస్తుతం చెడు వానలు కురిసే తరుణం కావడంతో వీరికి మరింత ముప్పు వాటిల్లనుంది. సూర్యాపేట జిల్లాలో ఎక్కడా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం అక్కడక్కడా కోసిన పంటను గతంలో ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో ఆరబోస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరుతున్నారు.

# లే'అవుట్'

కుత్బుల్లాపూర్ : ఎల్‌ఆర్‌ఎస్ కింద అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కొందరు వ్యక్తులు ప్రైవేటు పట్టా భూములు లేఅవుట్లు చేసే క్రమంలో చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ స్థలాలను కబ్జా చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ మార్గదర్శకాల ప్రకారం ఆయా లేఅవుట్లలో ఉన్న ప్లాట్లు ప్రభుత్వ సర్వే నంబరులో ఉన్నాయా? లేదా? అనేది రెవెన్యూ అధికారులు నిర్ధారించాలి. కొన్నేళ్లుగా కనుమరుగవుతున్న స్థలాలను పట్టించుకోని యంత్రాంగం తాజాగా ఎలా స్పందిస్తుందోననే ఆసక్తి నెలకొంది.

**పదిహేడు ఎకరాల ఆక్రమణ..**

గాజులరామారం సర్కిల్‌లో రెండు దశాబ్దాలుగా కొందరు వ్యక్తులు వెంచర్లు వేసి విక్రయిస్తున్నారు. దీని మాటున రూ.470 కోట్లు విలువ చేసే 17.27 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించారు. కొందరు



పథకం ప్రకారం ప్రైవేటు భూములు కొనుగోలు చేసి చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూములు కలుపుకొన్నారు. పాత తేదీలతో గ్రామ పంచాయతీ లేఅవుట్లు (అక్రమ లేఅవుట్లు) సృష్టించి కనీసం సామాజిక అవసరాలకు స్థలాలు కేటాయించకుండా ప్లాట్లు వేసి విక్రయాలు చేపట్టారు. ఈ లేఅవుట్లలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న ప్లాట్లను ఎల్‌ఆర్‌ఎస్ కింద క్రమబద్ధీకరించేందుకు నిర్వాహకులు పావులు కదుపుతున్నారు. సంబంధిత లేఅవుట్లపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని కుత్బుల్లాపూర్ ఉప తహసీల్దార్ మల్లికార్జున్‌తెలిపారు.

**కమిషనర్ పరిశీలన..**

గాజులరామారం 11,12,13,100,127 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ గత నెల 27న క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. ఆయా సర్వేనంబర్లలో ఎక్కడెక్కడ ఎంత భూమి కబ్జాకు గురైందో రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించడంతో కబ్జాదారుల వెన్నులో వణుకు పుడుతోంది.

# అత్యాశే.. అంతమొందిస్తోంది

జగిత్యాల: నిమిషాల్లో రూ.లక్షలు, గంటల్లో రూ.కోట్లు సంపాదించవచ్చనే ఆశ యువకులను ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్‌ల వైపు ఆకర్షిస్తోంది. కష్టపడితేనే నాలుగు రాళ్లు వెనకేసుకోవచ్చనే నిజాన్ని దాటేసి ఆన్‌లైన్ జూదం వైపు పరుగులు పెడుతున్నారు. బెట్టింగుల్లో పెట్టుబడులు పెడుతూ తాము మోసపోయామని గ్రహించేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. చేతిలో చిల్లిగవ్వలేక, తల్లిదండ్రులకు ముఖం చూపించలేక, సమాజంలో బతకలేమన్న బలహీనమైన ఆలోచనతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బెట్టింగ్ మాయలో పడి ఏడాదిలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు.

గడచిన రెండేళ్లలో 1,298 బెట్టింగ్, గేమింగ్ యాప్‌లను కేంద్రం రద్దు చేసింది. దీంతో అక్షరాలు మార్చి మరీ నిర్వాహకులు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ ప్రారంభం కావడంతో ఈ మోసాలు మరింత పెరిగాయి. క్రికెట్‌తో పాటు క్యాసినో, పోకర్, రమ్మీ యాప్స్ యువకులను నిండా ముంచుతున్నాయి. బెట్టింగ్ కోసం అప్పులు చేయడం.. అవి తీర్చేందుకు మళ్లీ అప్పులు చేయడం.. ఒక్కోసారి రుణయాప్స్‌లో డబ్బులు తీసుకోవడంతో తలకు మించిన భారమవుతోంది.

**పెరిగిన నిఘా**

తెలంగాణ గేమింగ్ చట్టం 2017 ప్రకారం ఆన్‌లైన్ గేమింగ్‌పై నిషేధం విధించారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా అసెంబ్లీలో రాష్ట్రంలో ఆన్‌లైన్ బెట్టింగ్/గేమింగ్‌లపై చర్యలు తీసుకునేందుకు సిట్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు డీజీపీ సిట్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ యాప్స్ నిర్వాహకులపై నిఘా పెంచిన పోలీసులు యువకులను కూడా సామాజిక మాధ్యమాల ద్వారా అప్రమత్తం చేస్తున్నారు.

**విషాదాలు ఇవీ..!**

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో డయాగ్నొస్టిక్ సెంటర్‌లో పనిచేసే



యువకుడు బెట్టింగ్ యాప్స్‌లో రూ.10 లక్షల మేర నష్టపోయాడు. ఆర్థికంగా కోలుకోలేని స్థితిలో ఆత్మహత్యకు పాల్పడి కుటుంబసభ్యులకు తీరని మనోవేదన మిగిల్చాడు.

కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ఇప్పలపల్లికి చెందిన యువకుడు ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడి డబ్బులు పోగొట్టుకోవడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

పెద్దపల్లి జిల్లా యైటింక్లైన్‌కాలనీకి చెందిన యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్‌ల వలలో పడి రూ.11 లక్షలు నష్టపోయాడు. ఉన్నదంతా కోల్పోయి చివరకు బలవన్మరణానికి పాల్పడ్డాడు.

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లికి చెందిన బీటెక్ విద్యార్థి ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడ్డాడు. అప్పులు పెరిగిపోవడంతో మనోవేదనతో తమ వ్యవసాయబావిలోనే దూకి ప్రాణాలు కోల్పోయాడు.

**బెట్టింగ్ వలలో పడొద్దు**

రఘుచందర్, డీఎస్పీ, జగిత్యాల

ఆన్‌లైన్ మోసాల బారిన పడినవారు కోలుకోవడం చాలా కష్టం. సాంకేతికతను ఆసరా చేసుకొని అమాయకులను వలలో వేసుకుంటారు. తెలియని నంబర్ల ద్వారా వచ్చే ఆన్‌లైన్ లింకులు కూడా ప్రమాదాన్ని కొనితెస్తాయి. కష్టపడితే యువకులకు బంగారు భవిష్యత్తు ఉంటుంది. మోసాల బారిన పడి ప్రాణాలు కోల్పోతే తల్లిదండ్రులకు తీరని శోకం మిగులుతుంది.




అమరావతి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతులమీదుగా రాజధాని అమరావతి పనులు పున: ప్రారంభమయ్యాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలకు, రాజధాని రైతులకు, కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన ప్రభుత్వ యంత్రాంగానికి, అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులకు, కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లిన మీడియా, సోషల్ మీడియా వారికి కృతజ్ఞతాపూర్వక నమస్కారాలు తెలియజేస్తున్నానని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. ప్రజల సహకారంతో, కేంద్ర ప్రభుత్వ మద్దతుతో, పక్కా ప్రణాళికతో అందరికీ అవకాశాలు సృష్టించేలా, రాష్ట్రానికి చోదక శక్తిగా నిలిచేలా ఫ్యూచర్ సిటీగా రాజధాని అమరావతిని నిర్మిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధించి తమకు అండగా ఉన్న ప్రజల నమ్మకాన్ని నిలబెడతామని అన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి పేరుపేరునా సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు.~గా.. అమరావతిలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిన్న(శుక్రవారం) పర్యటించారు. ప్రధానిమోదీ పర్యాటన ఆసక్తికరంగా సాగింది. అమరావతి సభ వేదిక నుంచి ఏపీలో రూ. 58 వేల కోట్ల పనులకు మోదీ శ్రీకారం చుట్టారు. ఏపీలో పలు ప్రాజెక్ట్‌లకు శకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అమరావతి సభకు ఏపీలోని వివిధ జిల్లాల నుంచి రైతులు, ప్రజలు భారీగా తరలి వచ్చారు.

అమరావతి సభ కోసం ఏపీ ప్రభుత్వం పటిష్ట భద్రతా చర్యలు చేపట్టింది. జిల్లాల నుంచి ప్రజలను తీసుకురావడానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, కూటమి నేతలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.






## అమరావతి పున:ప్రారంభంపై ప్రధాని మోడీ ఆసక్తికర ట్వీట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శుక్రవారం రోజు భారత ప్రధాని నరేంద్ర మోడీ పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం, శంకుస్థాపనలు చేశారు. అలాగే రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం.. పునఃప్రారంభం కార్యక్రమంలో పాల్గొని పనులను ప్రారంభించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సభలో ప్రధాని ప్రసంగించిన విషయం తెలిసిందే. అయితే ఏపీ పర్యటన ముగిసిన అనంతరం ఢిల్లీకి వెళ్లిన తర్వాత ప్రధాని మోడీ తన ఎక్స్‌లో తెలుగులో ఆసక్తికర ట్వీట్ చేశారు. "అమరావతి అభివృద్ధిలో నూతన, చారిత్రాత్మక అధ్యాయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని నా సోదర, సోదరీమణుల మధ్య ఉండటం ఆనందంగా ఉంది. అమరావతి భవిష్యత్ పట్టణ కేంద్రంగా ఆవిర్భవిస్తుందని, ఇది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథాన్ని మెరుగుపరుస్తుందని నేను విశ్వసిస్తున్నాను. నాకు మంచి మిత్రుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి అమరావతి పట్ల ఉన్న దార్శనికత, ఆంధ్రప్రదేశ్ ప్రజల సంక్షేమం పట్ల ఆయనకున్న నిబద్ధతను నేను అభినందిస్తున్నాను. నూతన,చారిత్రక అధ్యాయాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉంది" అని రాసుకొచ్చారు.

## పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలి



నెల్లూరు: పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మి అమ్మవార్లను ఇవాళ(శనివారం) రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దర్శించుకున్నారు. పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి ఆనం ఆదేశాలు జారీచేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని అధికారులకు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచించారు. 12 రోజుల పాటు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. రెండు నెలల క్రితం పులి సంచరిస్తోందని సోషల్ మీడియాలో వచ్చిన నేపథ్యంలో ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆనం ఆదేశించారు. అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆర్ అండ్ బీ రోడ్ల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఆలయ అర్చకుల సూచనల మేరకు ఆగమ శాస్త్రం ప్రకారం బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు.




తిరుపతి: తిరుపతిలో బుగ్గమఠం భూముల సర్వే చేపట్టారు. ఆక్రమణల గుట్టు విప్పేందుకు అధికారులు రంగంలోకి దిగారు. రోవర్‌తో బుగ్గమఠం భూముల వద్దకు అధికారులు వచ్చారు. డిస్ట్రిక్ట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ల్యాండ్ సర్వేయర్ చిట్టిబాబు, దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణారెడ్డి ఈ సర్వేలో పాల్గొన్నారు. 16వ ఆర్థిక సంఘం పర్యటన దృష్ట్యా గత నెలలో సర్వే వాయిదా పడింది. ఆక్రమిత బుగ్గమఠం భూముల సర్వే కోసం గత నెల 11న దేవాదాయ శాఖ నోటీసులు ఇచ్చింది. మాజీ మంత్రి పెద్దిరెడ్డితోపాటు మరో నలుగురికి నోటీసులు ఇచ్చారు. 261/1, 261/2 సర్వే నంబర్లలో 3.88 ఎకరాలు ఆక్రమించినట్లు నోటీసులు అందించారు. అయితే.. ఆ భూములతో తనకు సంబంధం లేదని మాజీ మంత్రి పెద్దిరెడ్డి పేర్కొన్నారు. తన సోదరుడు ద్వారకానాథరెడ్డి కొనుగోలు చేశారని చెప్పారు.

## వసూళ్లకు పాల్పడుతున్నట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా: అఖిలప్రియ



నంద్యాల: నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో తాను అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు నిరూపిస్తే.. రాజీనామా చేస్తానని తెదేపా స్థానిక ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. వైకాపా నాయకులు, సాక్షి పత్రిక పదే పదే అబద్ధాలు చెప్పటం పరిపాటి అయ్యిందని విమర్శించారు. వైకాపా హయాంలో జరిగిన అక్రమాలను తాము సరిదిద్దే పనిలో ఉన్నామని, అది మింగుడుపడక తమపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు.



## నాడు మట్టి కొట్టారు.. నేడు సున్నం కొట్టి వెళ్లారు: మోదీ సభపై షర్మిల సెటైర్లు

అమరావతి : ప్రధాని మోదీ తీరు చూస్తే చిచ్చుబుడ్డి తుస్సుమంది అనక తప్పదంటూ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సెటైర్లు వేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 94(3) సెక్షన్ ప్రకారం.. నవ్యాంధ్ర నూతన రాజధాని నిర్మాణ బాధ్యత పూర్తిగా కేంద్రానిదేనని స్పష్టం చేశారు. నూతన రాజధానిలో మౌలిక సదుపాయాలు కల్పన కేంద్రం కల్పించి ఇవ్వాల్సిందేనని అన్నారు. విభజన చట్టంలో కేంద్రం విధులేంటో ఇంత స్పష్టంగా పేర్కొంటే.. మరి ప్రధాని మోదీ మనకు ఇస్తున్నది ఏమిటి..? అని ప్రశ్నించారు. ఆనాడు 2015లో మట్టి కొట్టారని.. నేడు సున్నం కొట్టి వెళ్లారంటూ కౌంటర్ ఇచ్చారు. 10 ఏళ్ల క్రితం ఏం చెప్పి ఆంధ్రులకు తీరని ద్రోహం చేశారో.. నేడు అవే అబద్ధాలను అందంగా చెప్పి ఘరానా మోసం చేశారు. మళ్లీ "అభివృద్ధి చేస్తాం, భుజాలు కలుపుతాం" అంటూ బూటకపు మాటలు చెప్పారు.

5 కోట్ల మంది కలల సౌధం అమరావతికి 2015 నుండి అన్ని చేశామని పచ్చి అబద్ధాలు చెప్పారు. అన్ని ఇస్తే మాకు రాజధాని నిర్మాణం ఇంతవరకు ఎందుకు కాలేదు..? అమరావతి నిర్మాణానికి ఖర్చయ్యే లక్ష కోట్లలో ఒక్క రూపాయి అయినా ప్రకటించారా..? రాజధాని నిర్మాణం కేంద్రం బాధ్యత అని హామీ ఇచ్చారా..? కనీసం అమరావతికి చట్టబద్ధత ఇస్తున్నామని చెప్పారా..? పోనీ విభజన హామీలపై టైమ్ బాండ్ క్లారిటీ ఇచ్చారా..? చంద్రబాబు గారు ఆత్మ పరిశీలన చేసుకోవాలి. మోడీని నమ్మి మళ్ళీ మళ్ళీ మోసపోతున్నట్లు తెలుసుకోవాలి. ఏదో ఉద్ధరిస్తారని, కాసులు కురిపిస్తారని నమ్మి.. ఒకసారి రాత్రి గోతిలో పడ్డ చంద్రబాబు గారు.. మళ్లీ మోడీని పిలిచి అదే గోతిలో పగలు పడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గారిని కాంగ్రెస్ పార్టీ పక్షాన సూటిగా ప్రశ్నిస్తున్నాం. రాజధానికి కావాల్సింది అప్పులు కాదు.. నిధులు. రాష్ట్రం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని, అప్పు పుట్టనిదే జీతాలకు దిక్కులేదని.. చెప్పే మీరు రాజధాని నిర్మాణానికి ఎవరిని అడిగి రూ.60 వేల కోట్లు అప్పు తెస్తున్నారు..? వడ్డీల భారం మోసేదెలా..? వరల్డ్ బ్యాంక్, ADB, KFW, హడ్కోల దగ్గర రాష్ట్రాన్ని ఎందుకు తాకట్టు పెడుతున్నారు..? ప్రభుత్వ భూములు అంటే ప్రజల ఆస్తి వాటిని అమ్మి రాజధాని ఎలా కడతారు..? కేంద్రం మెడలు వంచే దమ్ములేక.. భావితరాల మీద అప్పు భారం ఎందుకు మోపుతున్నారో.. రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు గారు సమాధానం చెప్పాలి." అని షర్మిల డిమాండ్ చేశారు.



## జగన్ పై నోరెత్తని నమో..వై.?

నిన్న వెలగపూడిలో జరిగిన అమరావతి పునః ప్రారంభ వేడుకలకు విచ్చేసిన ప్రధాని నరేంద్ర మోడీ అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, దీని కోసం రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ఆంధ్రప్రదేశ్ ను అభివృద్ధి చేస్తామంటూ మోడీ ఏపీ ప్రజలకు మరోసారి హామీ ఇచ్చారు. అలాగే కూటమి రాక తో అమరావతి గ్రహణం వీడింది, ఇక రానున్న మూడేళ్లలో అమరావతి ఏపీ ని ఆర్థికంగా, పారిశ్రామికంగా ధృడంగా చేస్తుందంటూ భరోసా ఇచ్చిన నమో, గత ఐదేళ్ల వైసీపీ గ్రహణం మీద ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. మూడు రాజధానుల పేరుతో అమరావతి విధ్వంసానికి పూనుకున్న మాజీ ముఖ్యమంత్రి వైస్ జగన్ తీరును కానీ, వైసీపీ విధానాలను కానీ నమో విమర్శించలేకపోయారు. అలాగే గత పదేళ్లుగా అమరావతి నిర్మాణాలకు అవసరమైన అన్ని సదుపాయాలను కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది అంటూ చెప్పిన మోడీ గత ఐదేళ్లు అమరావతిలో కనీసం ఒక్క ఇటుక పేర్చని జగన్ ను కానీ, ఒక్క బస్తా సిమెంట్ వేయని వైసీపీ ప్రభుత్వాన్ని కానీ ఎందుకు విమర్శించలేకపోయారు. రాజధాని నిర్మాణాల కోసం కేంద్రం నిధులను వెచ్చిస్తే ఆ నిధులను వైసీపీ ప్రభుత్వం ఏం చేసింది.? ఆ నిధులను రాజధాని నిర్మాణాలకు కాకుండా జగన్ ఎటువైపుకి మళ్లించారు.? గత ఐదేళ్ల వైసీపీ హయాంలో కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన నిధులెంతా.? వైసీపీ చేసిన అభివృద్ధి ఎంత అనేదానిమీద కూడా మోడీ వివరించి ఉంటే వైసీపీ నోటికి కళ్లెం వేసినట్లయ్యేది. అయితే గత ఐదేళ్లలో వైసీపీ రాష్ట్రాన్ని అభివృద్ధికి ఆమడ దూరంలో, ఆర్థికంగా పాతాళంలోకి నెట్టేసింది. ఇప్పటికి రాష్ట్ర రాజధాని అమరావతి పై నిత్యం విషం చిమ్ముతూనే ఉంది. కనీసం సాక్షిలో అమరావతి పునః ప్రారంభ వేడుకలను ప్రసారం చేయడానికి కూడా ఆసక్తి చూపని వైసీపీ రేపటి రోజున అధికారంలోకి వస్తే.? అన్న రాజధాని రైతుల అనుమానాలకు, ఏపీ ప్రజల సందేహాలకు సభా వేదిక ద్వారా మోడీ ఒక భరోసా కల్పించివుంటే బాగుండేదనే అభిప్రాయం సర్వత్రా వినిపిస్తుంది. రాజకీయాలలో ఎప్పుడు ఏమైనా జరగొచ్చు, రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు అంటూ ఎవరు ఉండరు అనే నానుడిని బలంగా నమ్మే బీజేపీ ఇటు టీడీపీ, జనసేనలతో మిత్ర బంధంలో ఉంటున్నప్పటికీ అటు వైసీపీ తో శత్రుత్వాన్ని కోరుకోవడం లేదనే సంకేతాలను నమో ఇస్తున్నారా.? లేక వైస్ జగన్ సోదరి వైస్ షర్మిల ఆరోపిస్తున్నట్టుగా జగన్ మోడీకి దత్త పుత్రుడుగా తెరచాటు రాజకీయం నడుపుతున్నారా.?

## తేల్చుకుందాం రా.. పంచెలు పైకి ఎగ్గట్టి.. మీసాలు మెలేసీ మరీ..తాడిపత్రిలో టెన్షన్

తాడిపత్రి రాజకీయాలు మరోసారి హీటెక్కాయి. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి మధ్య వార్ మరింత ముదిరే అవకాశమునట్లే కనిపిస్తుంది. మరోవైపు తాడిపత్రికి వెళ్లేందుకు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి న్యాయస్థానం అనుమతి ఇవ్వడంతో ఆయన మరో రెండు రోజుల్లో తాడిపత్రికి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇన్నాళ్లూ పోలీసుల ఆంక్షలతో తాడిపత్రిలోకి పెద్దారెడ్డి అడుగుపెట్టలేదు. అయితే న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఇప్పుడు కేతిరెడ్డి పెద్దారెడ్డి కూడా తాడిపత్రికి వచ్చేందుకు సిద్ధం కావడంతో టెన్షన్ క్రియేట్ అయింది. మరోవైపు పోలీసులు కూడా బిక్కుబిక్కుమంటూ ఏం జరుగుతుందోనని చూస్తున్నారు. నాడు దాడులు చేసి...కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అప్పటి జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంటికి వెళ్లి బీభత్సం సృష్టించారు. ఫర్నీచర్ ను ధ్వంసం చేశారు. జేసీ ప్రభాకర్ రెడ్డీ దమ్ముంటే రా అంటూ పంచె పైకి ఎగకట్టి మరీ సవాల్ విసిరారు. నాడు వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో కేతిరెడ్డి పెద్దారెడ్డిదే పైచేయి అయింది.

పోలీసులు కూడా చోద్యం చూస్తున్నట్లే వ్యవహరించారు. తర్వాత 2024 లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, తాడిపత్రిలో జేసీ ప్రభాకర్ రెడ్డి కుమారుడు అస్మిత్ రెడ్డి ఎమ్మెల్యే కావడంతో సీన్ రివర్స్ అయింది. నాటి నుంచి రెండు వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్నాయి. పెద్దారెడ్డి ఇంటికి వెళ్లిన జేసీ అనుచరులు ఆయన ఇంట్లోని ఫర్నీచర్ ను కూడా ధ్వంసం చేశారు. ఆంక్షలు ఎత్తివేయడంతో...దీంతో పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తుందని భావించి ఆయన రాకపై ఆంక్షలు విధించారు. అనంతపురంలోనే పెద్దారెడ్డి ఉంటున్నారు. ఇద్దరూ ఒకరిపై ఒకరు సవాళు విసురుకుంటున్నారు. అయితే తనను తాడిపత్రికి వెళ్లనీయడం లేదంటూ కేతిరెడ్డి పెద్దారెడ్డి న్యాయస్థానాన్ని ఆశ్రయించి మరీ పర్మిషన్ తెచ్చుకున్నారు.




తన అనుచరులతో కలసి రెండు రోజుల్లో తాడిపత్రిలోకి అడుగుపెడతానని పెద్దారెడ్డి చెబుతున్నారు. అయితే జేసీ ప్రభాకర్ రెడ్డి పెద్దారెడ్డికి ధీటైన కౌంటర్ ఇచ్చారు. తాడిపత్రికి రా.. చూసుకుందాం.. ఎవరు ఏంటో తేల్చుకుందాం.. అంటూ సవాల్ విసిరారు. న్యాయస్థానం అనుమతి ఇచ్చినా తాను తాడిపత్రికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.జేసీ తాజా వార్నింగ్ తో...తాడిపత్రికి వస్తే తేల్చుకుందామంటూ తాజాగా జేసీ ప్రభాకర్ రెడ్డి చేసిన హెచ్చరికలతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

పెద్దారెడ్డి తాడిపత్రికి వెళితే మరోసారి హింస చెలరేగే అవకాశముందని భావించిన పోలీసులు భారీగా మోహరించారు. ఒక వైపు న్యాయస్థానం ఆదేశాలు, మరోవైపు జేసీ ప్రభాకర్ రెడ్డి సవాళ్లతో పోలీసులకు ఇబ్బందిగా మారింది. తాడిపత్రిలో ప్రస్తుతం ప్రశాంత వాతావరణం ఉందని, ఇద్దరూ సంయమనం పాటించి ఎవరి రాజకీయాలు వారు చేసుకోవడం మంచిదని కొందరు సూచిస్తున్నా.. వినేది ఎవరు.. వాళ్లిద్దరూ ఒకరు పెద్దారెడ్డి.. మరొకరు ప్రభాకర్ రెడ్డి. అందుకే తాడిపత్రిలో ఎప్పుడైనా ఏదైనా జరగొచ్చని పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

## తోపుదుర్తిని తప్పిస్తున్నారా.. బయటపడ్డ పోలీసుల వైఫల్యం

శ్రీ సత్యసాయి జిల్లా, మే 3: సత్యసాయి జిల్లా పోలీసుల వైఫల్యం మరోసారి బయటపడింది. కుంటిమద్ది హెలిప్యాడ్‌లో జరిగిన ఘటనలో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిపై కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రకాష్ రెడ్డిని అరెస్ట్ చేస్తున్నామంటూ సికేపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీధర్.. తోపుదుర్తి ఇంటికి వెళ్లి సెర్చ్ చేస్తున్నట్టు హడావుడి చేశారు. అయితే తోపుదుర్తి అజ్ఞాతంలో ఉన్నారని.. సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేశారంటూ కబుర్లు చెబుతూ మాజీ ఎమ్మెల్యేను పోలీసు ఉన్నతాధికారులు తప్పించే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి . ఇక్కడ సీన్ కట్ చేస్తే.. తోపుదుర్తి దర్జాగా హైదరాబాద్ రోడ్లపై పబ్లిక్‌గా తిరుగుతున్నారు. హైదరాబాద్‌లో పబ్లిక్‌గా తిరుగుతున్నప్పటికీ పోలీసులు అరెస్టు చేయకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోడ్లపై తిరుగుతున్నట్లుగా తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి సంబంధించిన వీడియో బయటకు వచ్చిన నేపథ్యంలో సత్యసాయి జిల్లా పోలీసులు చిక్కుల్లో పడ్డారు. ప్రకాష్ రెడ్డి, అతని అనుచరులు పబ్లిక్‌గా తిరుగుతున్నప్పటికీ శ్రీ సత్యసాయి జిల్లా పోలీసులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న పరిస్థితి. పోలీసు ఉన్నతాధికారుల డైరెక్షన్‌లోనే తోపుదుర్తి వ్యవహారం నడుస్తోందన్నది కింది స్థాయి పోలీసు సిబ్బంది మాట. తూతూ మంత్రంగా తనిఖీలు.. బెయిల్ తెచ్చుకున్నంత వరకు సహకరిస్తున్న పోలీసు అధికారులపై టీడీపీ నేతలు మండిపడుతున్నారు. పోలీస్ అధికారుల వైఖరిపై ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె వర్గీయులు ఇప్పటికే పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఆయన కుటుంబ సభ్యులపై లేపేస్తామంటూ వ్యాఖ్యలు చేసిన తోపుదుర్తి చందు విషయంలో కూడా పోలీసుల నిర్లక్ష్యం బయటపడింది. తోపుదుర్తి కుటుంబ సభ్యుల విషయంలో ఎందుకు పోలీసులు ఈ వైఖరి అవలంబిస్తున్నారన్నది టీడీపీ శ్రేణుల్లో హాట్‌హాట్‌గా చర్చ నడుస్తోంది.

## వైష్ణవి చైతన్య.. క్యూట్ నెస్ కు కేరాఫ్ అడ్రస్!!

టాలీవుడ్ హీరోయిన్ వైష్ణవి చైతన్య గురించి అందరికీ తెలిసిందే. టాలెంట్ ఉన్న తెలుగు అమ్మాయిలకు సినీ ఇండస్ట్రీలో కచ్చితంగా అవకాశాలు వస్తాయని చెప్పడంలో బెస్ట్ ఎగ్జాంపుల్ గా నిలిచింది. షార్ట్ ఫిల్మ్ ద్వారా కెరీర్ స్టార్ట్ చేసిన అమ్మడు.. లవ్ ఇన్ 143 అవర్స్, సాఫ్ట్ వేర్ డెవలపర్, మిస్సమ్మ వంటి పలు సిరీసులతో అలరించింది. అలా వివిధ వెబ్ సిరీసులతో యూత్ లో మంచి పాపులారిటీ సంపాదించుకుంది. అదే సమయంలో సినిమాల్లో చిన్న క్యారెక్టర్స్ చేయడం స్టార్ట్ చేసిన అమ్మడు.. టచ్ చేసి చూడుతో ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ తర్వాత గీత గోవిందం, అల వైకుంఠపురంలో, టాక్ జగదీశ్, వరుడు కావలెను వంటి సినిమాల్లో యాక్ట్ చేసింది బ్యూటీ. ఆ తర్వాత ఒక్కసారిగా ఆమె సుడి తిరిగిందని చెప్పాలి. బేబీ మూవీ హీరోయిన్ గా ఛాన్స్ వైష్ణవి సొంతమైంది. ఆనంద్ దేవరకొండ



హీరోగా సాయి రాజేష్ దర్శకత్వం వహించిన ఆ సినిమాకు హార్ట్ అండ్ సోల్ ఆమెనే చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. అంతలా తన యాక్టింగ్ తో అన్ని వర్గాల ప్రేక్షకులను ఓ రేంజ్ లో ఆకట్టుకుంది. రూ.100 కోట్లు సాధించిన ఆ సినిమాకు గాను ఫిల్మ్ ఫేర్ అవార్డు సొంతం చేసుకుంది. ఆ తర్వాత ఆమెకు ఒక్కసారిగా క్రేజీ బ్యూటీ గా మారిపోయింది. పలు సినిమా అవకాశాలు దక్కించుకుని నటిస్తోంది. అదే సమయంలో వైష్ణవి చైతన్యకు సంబంధించిన కొన్ని బ్యూటిఫుల్ పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. నిజానికి.. వైష్ణవి బర్త్ డే రోజు పెట్టిన పోస్ట్ ఇప్పుడు మళ్లీ వైరల్ అవుతోంది. అందులో ఒక్కో పిక్ వేరే లెవెల్ లో ఉంది. ప్రతి ఫోటోలో ఆమె ఇచ్చిన ఎక్స్ప్రెషన్స్ వేరే లెవెల్ అని చెప్పాలి. క్యూట్ నెస్ కు కేరాఫ్ అడ్రస్ గా నిలిచింది. తన గ్లామరస్ స్కిన్ టోన్ తో ఫిదా చేస్తుంది. ట్రెడిషనల్ అండ్ మోడ్రన్ ఔట్ ఫిట్స్ లో క్లీన్ బౌల్డ్ చేస్తుందనే చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. ప్రస్తుతం వైష్ణవి పిక్స్ ఉన్న పోస్ట్ పై నెటిజన్లు తెగ రెస్పాండ్ అవుతున్నారు. బేబీ బ్యూటీ సో క్యూట్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. అందమే అసూయ పడుతుందేమోనని ఆకాశానికెత్తేస్తున్నారు. అమ్మడు పిక్స్ అదిరిపోయాయని అంటున్నారు. అట్రాక్ట్ అయిపోతున్నామని చెబుతున్నారు. సో నైస్ మేడమ్ అంటూ సందడి చేస్తున్నారు నెటిజన్లు.. వైష్ణవి అభిమానులు..

## 28 కోట్లకు సీనియర్ బ్యూటీ ప్రీమియం ప్రాపర్టీ!

సెలబ్రిటీల ఆదాయాల గురించి చెప్పాల్సిన పనిలేదు. ఫాంలో ఉన్నంత కాలం రెండు చేతులా సంపాదన. వచ్చిన ఆదాయంతో వివిధ వ్యాపారాల్లో పెట్టుబడులు పెడుతుంటారు. తద్వారా భారీ మొత్తంలో లాభాలు ఆర్జిస్తుంటారు. ఇప్పటికే చాలా మంది తారలు రియల్ ఎస్టేట్ రంగంలో మంచి లాభాలు చూస్తున్నారు. తాజాగా బాలీవుడ్ నటి కాజోల్ తాజాగా ముంబైలోని గోరేగావ్‌లో ప్రీమియం రిటైల్ ప్రాపర్టీని కొనుగోలు చేసింది. రూ. 28.78 కోట్లు విలువగల ప్రాపర్టీని కొనుగోలు చేసింది. భారత్ రియాల్టీ వెంచర్స్ కి చెందిన 4,365 చదరపు అడుగుల విస్తీర్ణం గల స్థలాన్ని కొనుగోలు చేసింది. ఈ స్పేస్ లో మొత్తం ఐదు కార్ల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలం కూడా ఉంది. 2023 లో కాజోల్ ముంబైలో 7.64 కోట్లతో ఓ ఆఫీసు స్థలాన్ని కూడా కొనుగోలు చేసింది. 194.67 చదరపు మీటర్ల విస్తీర్ణంలో రెరా కార్పెట్ ఏరియాలో విస్తరించింది ఈ ఆఫీస్ స్పేస్. అలాగే అంధేరీ వెస్ట్‌లోని వీర దేశాయ్ రోడ్డు ని అనుకుని ఓ సిగ్నేచర్



బిల్డింగ్ కూడా కొనుగోలు చేసింది. అదే ఏడాది భారత్ రియల్టీ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ నుండి 16.50 కోట్లతో మరో అపార్ట్‌మెంట్ కూడా కొనుగోలు చేసింది. ఇలా కొంత కాలంగా కాజోల్ సంపాదనంతా రియల్ రంగంలోనే పెట్టుబడులుగా పెడుతుంది. కొనుగోలు చేసిన నెలల వ్యవధిలోనే వాటి ధర రెట్టింపు అవుతుంది. బాలీవుడ్ తారలు కొంత కాలంగా కమర్షియల్ ప్రాపర్టీలలో పెట్టుబడి పెట్టడానికి ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. రెసిడెన్షియల్ రియల్ ఎస్టేట్‌తో పోల్చితే వార్షిక అద్దె రాబడి ఎక్కువగా ఉన్నందున బాలీవుడ్ తారలు కమర్శియల్ ప్రాపర్టీస్ క్రయ, విక్రయాలు జరపడానికి ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికే చాలా మంది బాలీవుడ్ తారలకు బాంద్రా, ఖార్, అంధేరిలోని లోఖండ్‌వాలా , వర్లీ వంటి ప్రాంతాల్లో ఉన్న అనేక భవనాలు, విల్లాలు ఉన్న సంగతి తెలిసిందే.




## ఆసక్తి పెంచుతున్న బకాసుర రెస్టారెంట్




టాలీవుడ్ ప్రముఖ కమెడియన్ ప్రవీణ్ త్వరలోనే హీరోగా ఎంట్రీ ఇస్తున్నాడు. బకాసుర రెస్టారెంట్ పేరుతో ఓ హంగర్ కామెడీ మూవీ చేస్తున్నాడు ప్రవీణ్. ఈ సినిమా ఫస్ట్ లుక్ ను మేకర్స్ తాజాగా రిలీజ్ చేశారు.

ఈ సినిమాలో వైవా హర్ష టైటిల్ రోల్ పోషిస్తుండగా, షైనింగ్ ఫణి కీలక పాత్రలో నటిస్తున్నాడు. కొన్నాళ్ల ముందట ప్రవీణ్ తర్వలోనే బకాసుర అనే పేరుతో రెస్టారెంట్ ను స్టార్ట్ చేయనున్నాడని వార్తలొచ్చిన విషయం తెలిసిందే. ఆల్రెడీ యాక్టర్ గా బిజీగా ఉన్న ప్రవీణ్ కు రెస్టారెంట్ ను స్టార్ట్ చేసి, దాని బాధ్యతలు తీసుకునేంత టైముందా అని అందరూ అనుకుంటున్న టైమ్ లో ఆ విషయంపై క్లారిటీ వచ్చేసింది. అయితే ప్రవీణ్ రెస్టారెంట్ స్టార్ట్ చేయడం లేదు. బకాసుర రెస్టారెంట్ అనే పేరుతో సినిమాను చేస్తున్నాడు. అందులో ప్రవీణ్ హీరోగా నటిస్తున్నాడనేది అసలు మ్యాటర్. తాజాగా మేకర్స్ ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ ను రిలీజ్ చేశారు. ఆ పోస్టర్ లో ప్రవీణ్ వంట చేస్తూ పెద్ద గెరిటతో కనిపించగా, పక్కన విచిత్ర ఆకారాల్లో వైవా హర్ష, షైనింగ్ ఫణి కనిపించి పోస్టర్ ను మరింత ఇంట్రెస్టింగ్ గా మార్చారు. అదే పోస్టర్ లో పాడుబడిన పాత బంగళా, మోడుబోయిన చెట్టు చూస్తుంటే సినిమాలో హర్రర్ ఎలిమెంట్స్ కూడా ఉన్నట్టు అర్థమవుతుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగానే ఫస్ట్ లుక్ ను రిలీజ్ చేయగా, ఆ లుక్ అందరినీ ఆకట్టుకుంటుంది. బకాసుర రెస్టారెంట్ సినిమాతో ప్రవీణ్ లోని కొత్త యాంగిల్ ను అందరూ చూస్తారని అందరూ చెప్పుకుంటున్నారు. హంగర్ కామెడీ అనే కొత్త కాన్సెప్ట్ తో తెరకెక్కుతున్న ఈ సినిమా అన్ని వర్గాల ఆడియన్స్ ను ఆకట్టుకుంటుందని చిత్ర యూనిట్ చెప్తోంది. బకాసుర రెస్టారెంట్ అనే సినిమాతో ఎస్‌జె శివ దర్శకుడిగా పరిచయం కానుండగా, ఈ సినిమాను ఎస్‌జె మూవీస్ బ్యానర్ లో లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి నిర్మిస్తున్నారు.

## కుంభమేళాలో పూసలమ్మే అమ్మాయేనా?




ప్రయాగ్‌రాజ్ కుంభమేళా చాలా మెరుపుల్ని పరిచయం చేసింది. అలాంటి ఒక మెరుపు ఈ పూసలమ్మే అమ్మాయి. ఈ భామ పరిచయం అవసరం లేదు. మోనాలిసా తన పేరు.. పేరుకు తగ్గట్టే సమ్మోహన రూపంతో కట్టి పడేసిన ఈ పూసలమ్మాయికి దేశవ్యాప్తంగా గొప్ప ఫాలోయింగ్ ఏర్పడింది. కుర్రాళ్లు వెంటపడి విసిగించేంతగా తన అందంతో కవ్వించింది మోనాలిసా. పూసలు, దండలు అమ్మే ఈ అమ్మాయి వెంట బోయ్స్ పిచ్చెక్కి తిరిగారు. పలువురు దర్శకనిర్మాతలు మోనాలిసాకు తమ సినిమాల్లో అవకాశాలు కల్పించేందుకు ముందుకు వచ్చారు.

మోనాలిసా యూట్యూబ్ ఇంటర్వ్యూలు సంచలనంగా మారాయి. ఎట్టకేలకు మోనాలిసా తన తొలి సినిమాలో నటిస్తోందని వార్తలు వచ్చాయి. తాజా వీడియోలలో మోనాలిసా రూపు రేఖలు గుర్తు పట్టలేనంతగా మారిపోవడంతో ఇప్పుడు అందరూ ఆశ్చర్యపోతున్నారు. కట్టిపడేసేంతగా మేకోవర్‌తో ఆశ్చర్యపరుస్తోంది. అంతేకాదు ఈ మేకోవర్ తర్వాత మోనాలిసా గుర్తించలేనిదిగా కనిపిస్తోంది. అయితే ఈ మార్పునకు కారణం.. మేకప్ ఆర్టిస్ట్ మొహ్సినా అన్సారీ. మోనాలిసా రూపురేఖల్ని మార్చే విధంగా తనను అద్భుతంగా డిజైన్ చేసిన ఫోటోలు వీడియోలను షేర్ చేయగా అవి అంతర్జాలంలో వైరల్ గా మారుతున్నాయి. మోనాలిసా చీరల్లో పూర్తిగా గ్లామరస్‌గా కనిపించింది. ఒక క్లిప్‌లో మోనాలిసా వధువుగా దుస్తులు ధరించి, ఆకుపచ్చ పచ్చలతో అలంకరించుకుని, భారీ ఆభరణాలతో, సాంప్రదాయ ఎరుపు పెళ్లి లెహంగాను ధరించి కనిపించింది.

ఈ రూపం చూడగానే ఆమె ఈమేనా? అని ఆశ్చర్యపోయేంత సర్ ప్రైజ్ ని ఇచ్చింది. మరోసారి మోనాలిసా కొత్త రూపం వెబ్ లో హాట్ టాపిగ్గా మారింది. వైరల్ గర్ల్ మోనాలిసా మోడలింగ్ సహా సినిమాల్లో అవకాశాలు అందుకుని పెద్ద స్థాయికి ఎదిగేస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.

## మిర్రర్ సెల్ఫీతో సెగలు పుట్టిస్తున్న శివంగి

బుల్లితెర ముద్దుగుమ్మలు అంటే ఒకప్పుడు చిన్న చూపు ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. సినిమాల్లో హీరోయిన్స్‌కి ఏ స్థాయి గుర్తింపు అయితే ఉంటుందో ఆ స్థాయిలో లేదా అంతకు మించి గుర్తింపును బుల్లి తెర ముద్దుగుమ్మలు దక్కించుకుంటున్నారు. భాష ఏదైనా బుల్లి తెరకు ఇప్పుడు మంచి గుర్తింపు లభిస్తుంది. సీరియల్స్‌కి ఈమధ్య కాలంలో మంచి స్పందన వస్తున్న నేపథ్యంలో సీరియల్‌లో అయినా నటించేందుకు సిద్దం అన్నట్లుగా హీరోయిన్స్ రెడీ అవుతున్నారు. వెండి తెర హీరోయిన్స్‌కి తగ్గకుండా బుల్లి తెర హీరోయిన్స్ ఇన్‌స్టాలో అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఉంటారు. టీవీ సీరియల్స్ ద్వారా గుర్తింపు దక్కించుకున్న హీరోయిన్స్ ఇన్‌స్టాగ్రామ్‌లో అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా పాపులారిటీని సొంతం చేసుకుని హీరోయిన్స్‌గా ఆఫర్లు దక్కించుకున్న సందర్భాలు ఉన్నాయి. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఫోటోలు షేర్ చేస్తే ఇండస్ట్రీలో ఎంట్రీ దక్కుతుంది అనుకునే వారు చాలా మంది ఉ



న్నారు. అందుకే ఎంతో మంది అందాల ఆరబోత ఫోటోలతో మత్తెక్కిస్తూనే ఉంటారు. తాజాగా బుల్లితెర నటి శివంగి వర్మ తన అందమైన ఇన్‌స్టా ఫోటోలతో ఆకట్టుకుంటుంది. ఈ అమ్మడు షేర్ చేసిన మిర్రర్ సెల్ఫీ ఫోటోలతో ఆకట్టుకుంది. హిందీలో ఎన్నో సీరియల్స్‌లో శివంగి వర్మ నటించి మెప్పించింది. హమారీ సిస్టర్ దీదీ, బివి ఔర్ మైన్, భూతు ఇతర ప్రాజెక్ట్‌ల్లోనూ ఈమె కనిపించింది. బుల్లి తెర ద్వారా వచ్చిన గుర్తింపుతో ఇప్పటికే సినిమాల్లోనూ ఎంట్రీ ఇచ్చింది. బిచ్చగాడు 2 సినిమాలో ఈమె చేసిన ప్రత్యేక పాటకు మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా ఈ అమ్మడు తన అందంతో ఎప్పుడూ సోషల్ మీడియా ద్వారా ఆకట్టుకుంటూ ఉంటుంది. తాజా ఫోటో షూట్‌తో అసలు చూపు తిప్పుకోనివ్వడం లేదు. నడుము అందం చూపిస్తూ క్లీ వేజ్ షో చేసిన ఈ అమ్మడి ఫోటోలకు తెగ లైక్స్ వస్తున్నాయి. మత్తు కల్లతో మిర్రర్ ముందు నిల్చుని తన అందమైన నడుమును క్లిక్ అనిపించిన ఈ అమ్మడు నాభి అందంతో మతి పోగొడుతోంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ రేంజ్‌లో అందాల ఆరబోత చేసిన ముద్దుగుమ్మ శివంగికి బాలీవుడ్‌లో మరిన్ని మంచి ఆఫర్లు దక్కాల్సిన అవసరం ఉంది అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ అమ్మడి ఫోటోల జోరు, అందం, ఫిజిక్ చూస్తూ ఉంటే కచ్చితంగా భవిష్యత్తులో మంచి ఆఫర్లు దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. బుల్లి తెర నుంచి పర్మినెంట్‌గా వెండి తెరపై ఈ అమ్మడు సందడి చేస్తుందేమో చూడాలి.

## బ్లాక్ అండ్ వైట్‌లో పొన్నాడ సూపర్

నాగార్జున, కార్తీ హీరోలుగా నటించిన 'ఊపిరి' సినిమాలో చిన్న పాత్రలో కనిపించిన పూజిత పొన్నాడ మెల్ల మెల్లగా ఇండస్ట్రీలో నిలదొక్కుకుంటూ వస్తుంది. రామ్ చరణ్ హీరోగా నటించిన 'రంగస్థలం' సినిమాలో పూజిత పొన్నాడ ముఖ్య పాత్రలో నటించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. అప్పటి నుంచి చిన్న సినిమాల్లో మెయిన్ హీరోయిన్‌గా పెద్ద హీరోల సినిమాల్లో కీలక పాత్రల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ను సొంతం చేసుకుంది. కేవలం తెలుగు సినిమాల్లో మాత్రమే కాకుండా తమిళ్‌లోనూ ఈమె నటించింది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ మూవీ హరి హర వీరమల్లు సినిమాలో పూజిత కీలక పాత్రలో నటిస్తున్న తెలుస్తోంది. యంగ్ హీరోలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా సినిమాలు చేస్తున్న పూజిత పొన్నాడ సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. సినిమాలతోనే కాకుండా రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలతో అలరిస్తున్న పూజిత పొన్నాడ మరోసారి తన అందమైన ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోవర్స్‌తో పంచుకుంది. ఎప్పటిలాగే ఈసారి కూడా తన అందమైన లుక్‌తో పాటు స్టైలిష్ అవతార్‌లో



పూజిత పొన్నాడ కనిపించింది. అలరించే అందంతో పాటు బ్లాక్ అండ్ వైట్‌లో చూపు తిప్పనివ్వకుండా అందంగా కనిపిస్తుంది. బ్లాక్ అండ్ వైట్ లో క్లోజప్ పిక్స్‌ను షేర్ చేసింది. ఇంత అందంగా ఉన్న పూజిత పొన్నాడకి దక్కాల్సిన స్థాయిలో ఆఫర్లు దక్కడం లేదని అభిమానులు కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఈమెకు ఉన్న ఫాలోయింగ్‌కి తగ్గట్లుగా సినిమా ఆఫర్లు దక్కడం లేదనే అభిప్రాయంను పలువురు వ్యక్తం చేస్తున్నారు. ముందు ముందు అయినా పూజిత పొన్నాడకి స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాలు రావాలని నెటిజన్స్ కోరుకుంటున్నారు. ఈ ఏడాదిలో పూజిత నుంచి రెండు మూడు సినిమాలు అయినా వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. పవన్ కళ్యాణ్ తో ప్రస్తుతం నటిస్తున్న హరిహర వీరమల్లు సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంటే తప్పకుండా మరిన్ని సినిమాలు ఈ అమ్మడికి దక్కే అవకాశాలు ఉన్నాయి. భగవన్ అనే తమిళ్ సినిమాలోనూ ఈమె నటిస్తుంది. త్వరలోనే ఈమె మరో తెలుగు సినిమాలోనూ నటించబోతున్నట్లు సమాచారం అందుతోంది. మరో వైపు వెబ్ సిరీస్‌ల్లోనూ ఈమెకు నటించే అవకాశాలు వస్తున్నాయట. త్వరలోనే ఈమె వెబ్ సిరీస్‌లోనూ నటించే అవకాశాలు ఉన్నాయని సమాచారం అందుతోంది. ఇలాంటి ఫోటోలను షేర్ చేయడం ద్వారా ఇండస్ట్రీ నుంచి మరిన్ని ఆఫర్లు దక్కే అవకాశాలు ఉన్నాయి.




హైదరాబాద్ : హైడ్రా పోలీస్ స్టేషన్(పీఎస్) ను సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 8న ప్రారంభించనున్నారు.

బుద్ధభవన్‌లోని హైడ్రా ప్రధాన కార్యాలయం పక్కనే కొత్త పీఎస్‌ను ఏర్పాటు చేశారు. ఇకమీద చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై స్థానికులు, అధికారుల నుంచి వచ్చే ఫిర్యాదులను హైడ్రా పోలీస్ స్టేషన్లలో స్వీకరించి, కేసులు నమోదు చేయనున్నారు.

ఇప్పటివరకు పలు పోలీస్ స్టేషన్‌లలో నమోదైన భూకబ్జా కేసులను కూడా ప్రస్తుతం ప్రారంభం కానున్న హైడ్రా పోలీస్ స్టేషన్లకు బదిలీ చేయనున్నారు. ఇప్పటికే పీఎస్‌కు సంబంధించిన అధికారులు, సిబ్బందితోపాటు, డీఎస్పీ నియామకం కూడా పూర్తవడంతో కొత్త పీఎస్ అందుబాటులోకి వస్తే హైడ్రా మరింత దూకుడుగా వ్యవహరించే అవకాశం ఉంది.

**త్వరలో బతుకమ్మ కుంటకు సీఎం రేవంత్..** బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను మరింత స్పీడప్ చేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. కొద్దిరోజుల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి బతుకమ్మ కుంటను సందర్శిస్తారని చెప్పారు. ఆలోపు చెరువు పనులు పూర్తిచేయాలన్నారు. శుక్రవారం బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను రంగనాథ్ పరిశీలించి మాట్లాడారు. రూ. 7 కోట్లతో చెరువును అభివృద్ధి చేస్తున్నామన్నారు. వచ్చే బతుకమ్మ ఉత్సవాల నాటికి మహిళలు ఇక్కడే బతుకమ్మ ఆడేలా ఏర్పాట్లు చేస్తామన్నారు.

## ఉగ్రవాదులు, వారి మద్దతుదారులపై కఠిన చర్యలు: పహల్గాం దాడిపై మోదీ వ్యాఖ్యలు



ఢిల్లీ: ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద ముప్పు అని ప్రధాని మోదీ అన్నారు. దాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. భారత పర్యటనలో ఉన్న అంగోలా అధ్యక్షుడు జువా లోరెన్సోతో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. అనంతరం వీరిద్దరూ కలిసి సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా పహల్గాం ఉగ్రదాడి ఘటనను మోదీ ప్రస్తావించారు. “ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద ముప్పు. పహల్గాం దాడి నేపథ్యంలో సీమాంతర ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటానికి అంగోలా మద్దతు పలికింది. అందుకు ఆ దేశానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఉగ్రవాదులు, వారికి మద్దతు ఇచ్చేవారిపై కఠినమైన, నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడానికి మేం కట్టుబడి ఉన్నాం” అని మోదీ పునరుద్ఘాటించారు.




హైదరాబాద్: గృహ నిర్మాణ శాఖకు మంచి పేరు తేవాలని ఇంజినీర్లను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. ఎక్కడ తప్పు జరగకుండా చూసే బాధ్యత ఇంజినీర్లదే అన్నారు. న్యాక్‌లో 390 మంది అసిస్టెంట్ ఇంజినీర్లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ల శాఖలో పదోన్నతి పొందిన వారికి మంత్రి ఆర్డర్ కాపీలు అందజేసి మాట్లాడారు. “తప్పు జరిగిందని చెబితే చాలు.. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. టోల్‌ఫ్రీ నెంబర్ ఇస్తాం.. దానికి ఫోన్ చేసి వివరాలు చెప్పవచ్చు. నిజమైన పేదలకే ఇళ్లు కేటాయించాలి.. దీనిలో మరో మాట లేదు. ఇళ్ల నిర్మాణంలో ఆధునిక సాంకేతికత వాడుతున్నాం. ఫేజ్-1 నుంచి ఫేజ్-4 వరకు జాగ్రత్తగా సిఫారసు చేయాలి. అర్హులను ఎంపిక చేసేటప్పుడు అన్ని విషయాలూ పరిశీలించాలి. ఇళ్ల నిర్మాణంలో చిన్న ఫిర్యాదు వచ్చినా ఊరుకునేది లేదు” అని పొంగులేటి తెలిపారు.

## రేవంత్‌రెడ్డి 42 సార్లు ఢిల్లీ వెళ్లినా ఉపాధి పని దినాలు సగం తగ్గాయి: హరీశ్‌రావు



హైదరాబాద్: ఉపాధి హామీ పనిదినాలు 2024-25 సంవత్సరానికి 12.22 కోట్ల నుంచి 6.5 కోట్లకు తగ్గాయని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఈ మేరకు ఆయన ‘ఎక్స్’ వేదికగా పోస్టు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి 42 సార్లు ఢిల్లీ వెళ్లినా ఉపాధి పనిదినాలు సగం తగ్గాయని విమర్శించారు. విషయం తెలిసినా కాంగ్రెస్, భాజపా ఎంపీలు మౌనంగా ఉన్నారని మండిపడ్డారు. ఉపాధి హామీ కూలీల వేతనాలు 4 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. వెంటనే కూలీల పనిదినాలు పెంచాలని, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## మీ ప్రాంతంలో ప్రభుత్వ భూమి కబ్జా అయిందా? మంత్రి పొన్నం కీలక పిలుపు

ప్రభుత్వ భూమి కబ్జాకు గురైతే అధికారులకు సమాచారం ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్ లో సర్వే నెంబర్ 102/1HAK/1 లో కబ్జాకు గురైన 12 ఎకరాల ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ స్థలాన్ని శనివారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రెవెన్యూ అధికారులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ భూమికి ఫెన్సింగ్ వేసే విషయంలో అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ భూమిని కాపాడిన కలెక్టర్, ఆర్డీవో, తహశీల్దార్ ను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.






ఢిల్లీ: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈక్రమంలోనే దాయాదితో అన్ని రకాల దౌత్య సంబంధాలు తెంచుకుంటోన్న న్యూఢిల్లీ తాజాగా మరో గట్టి షాకిచ్చింది. ఆ దేశం నుంచి వచ్చే దిగుమతులపై నిషేధం విధించింది. ఈమేరకు కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశ భద్రత, ప్రజా విధాన ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. పాకిస్థాన్ నుంచి మన దేశానికి రవాణా అయ్యే అన్ని ఉత్పత్తులకు ఈ నిషేధం వర్తిస్తుందని స్పష్టం చేసింది. “పాకిస్థాన్‌లో ఉత్పత్తి అయ్యే లేదా ఆ దేశం నుంచి భారత్‌కు వచ్చే అన్నిరకాలా వస్తువుల ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులపై నిషేధం విధిస్తున్నాం. అనుమతులు ఉన్న ఉత్పత్తులైనా, స్వేచ్ఛాయుత దిగుమతులైనా సరే పాక్ నుంచి ఎలాంటి వస్తువులను అనుమతించబోం. ఈ నిషేధం తక్షణమే అమల్లోకి వస్తుంది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయి. ఈ నిషేధం నుంచి ఏవైనా మినహాయింపులు కావాలంటే.. భారత ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి” అని వాణిజ్య మంత్రిత్వ శాఖ తమ నోటిఫికేషన్‌లో వెల్లడించింది.


**దిగుమతుల విలువ తక్కువే..** భారత్-పాకిస్థాన్ మధ్య వాణిజ్యానికి ఉన్న ఏకైక రవాణా మార్గం అటారీ-వాఘా సరిహద్దు. ఇప్పటికే దాన్ని మూసివేసిన సంగతి తెలిసిందే. ఇక, 2019లో పుల్వామా దాడి తర్వాత నుంచి దాయాది నుంచి మనం చాలావరకు దిగుమతులు తగ్గించుకున్నాం. పాక్ ఉత్పత్తులపై కేంద్రం 200శాతం సుంకం విధించింది. కొన్ని రకాల ఫార్మా ఉత్పత్తులు, పండ్లు, నూనెగింజల వంటి వాటిని మాత్రమే దాయాది నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. గణాంకాల పరంగా చూస్తే కూడా.. ఈ దిగుమతుల విలువ చాలా తక్కువే. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి పాక్‌కు 447.65 మిలియన్ డాలర్ల వస్తువులు ఎగుమతి కాగా.. అక్కడినుంచి కేవలం 0.42 మిలియన్ డాలర్ల ఉత్పత్తులను మాత్రమే దిగుమతి చేసుకున్నాం. ప్రపంచవ్యాప్తంగా భారత్ జరుపుతున్న వాణిజ్యంలో ఇది కేవలం 0.1శాతం మాత్రమే.

**పాక్‌లో ఆ రంగాలపై ప్రభావం..** విలువ పరంగా ఈ వాణిజ్యం స్వల్పమే అయినప్పటికీ.. పాక్‌లోని కొన్ని పరిశ్రమలు భారత్‌కు చేసే ఎగుమతులపైనే ఆర్థికంగా ఆధారపడుతున్నాయి. ఆర్గానిక్ కెమికల్స్, ప్లాస్టిక్స్, విలువైన లోహ సమ్మేళనాలు, మినరల్ ఫ్యుయల్స్, నూనె ఉత్పత్తులు, కొన్ని రకాల పిండి పదార్థాలు, బంక, ఎంజైమ్స్, వర్ణ ద్రవ్యాలు, మసాలా దినుసులు వంటివి దిగుమతి చేసుకునే వస్తువుల్లో ఉన్నాయి. ఇప్పుడు భారత్ వాటిపై నిషేధం విధించడంతో పాక్‌లో ఆయా రంగాల పరిశ్రమలు కుదేలయ్యే అవకాశం ఉంది.

**పాక్ ఓడలు రావొద్దు..** మరోవైపు, పాకిస్తాన్‌తో సముద్ర రవాణా మార్గాలను భారత్ మూసివేసింది. ఆ దేశ జెండాతో ఉన్న ఓడలు భారత పోర్టుల్లోకి రాకుండా కేంద్రం నిషేధం విధించింది.

మర్చెంట్ షిప్పింగ్ చట్టం, 1958లోని 411 సెక్షన్ ప్రకారం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఆంక్షలు తక్షణమే అమల్లోకి వస్తాయని వెల్లడించింది. అటు భారత ఓడలు కూడా పాక్ పోర్టుల్లోకి వెళ్లకూడదని స్పష్టం చేసింది. ఇప్పటికే పాక్ విమానాలకు మన గగనతలాన్ని మూసివేసిన సంగతి తెలిసిందే.

## ప్రజల విశ్వాసాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కోల్పోయింది



మహబూబ్‌నగర్ సిటీ : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఏ హామీలు కూడా పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఇవాళ(శనివారం) మహబూబ్‌నగర్ జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయంలో ఎంపీ డీకే అరుణ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మీడియాతో మాట్లాడారు. ప్రజల ఆకాంక్ష మేరకు బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన తప్పుడు కులగణన అని విమర్శించారు. కేవలం ఎన్నికల కోసమే కులగణన అనే మాట మాట్లాడారని చెప్పారు. ప్రజల విశ్వాసాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కోల్పోయిందని ఎంపీ డీకే అరుణ విమర్శించారు. మొట్టమొదటి కులగణన 1931లో జరిగిందని ఎంపీ డీకే అరుణ గుర్తుచేశారు. ముస్లింలని బీసీ జాబితాలో చేర్చడం అంటే నిజమైన బీసీలను మోసం చేయడమేనని అన్నారు. 2026లో డీ లిమిటెషన్‌కి వెళ్తున్నామని అన్నారు. బీసీలు, ఓసీలకు నిజమైన న్యాయం చేసేది కేవలం ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాత్రమేనని చెప్పారు. జనగణనతో పాటు కులగణన చేయడం ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఒక గొప్ప సంకల్పమని అన్నారు. పార్టీలకు సంబంధం లేకుండా ప్రతి ఒక పేద కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యేలతో పాటుగా ఎంపీలకు కూడా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో కోటాను కల్పించాలని.. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తానని ఎంపీ డీకే అరుణ వెల్లడించారు.

## స్కాములు చేసిన వారిని వదలం.. మంత్రి సీతక్క మాస్ వార్నింగ్



మహబూబాబాద్: గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో స్కీముల పేరుతో స్కాములు చేసిన వారిని వదలమని మంత్రి సీతక్క హెచ్చరించారు. ఇవాళ(శనివారం) కొత్తగూడ మండలం బత్తులపల్లిలో మంత్రి సీతక్క పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. గొర్రెల పంపిణీ స్కీములో డబ్బులు తీసుకున్న వారిని ముక్కుపిండి వసూల్ చేస్తామని అన్నారు. తమ ప్రభుత్వంలో ఈ గొర్రెల పథకాన్ని వినుత్నంగా అమలు చేస్తామని ప్రకటించారు. రామప్ప వరల్డ్ హెరిటేజ్ కాబట్టి ప్రపంచ దేశాల సుందరీమణులను ఆహ్వానిస్తున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. బడుగు బలహీనవర్గాలకు చెందిన నేత దామోదర సంజీవయ్య అని టీపీసీసీ మాజీ చీఫ్ వీ. హనుమంతురావు కొనియాడారు. శనివారం నాడు హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో వీహెచ్ మీడియాతో మాట్లాడారు. మే 7వ తేదీన దామోదర సంజీవయ్య వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించడానికి పార్టీ ముఖ్య నేతలు అంతా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. దామోదర సంజీవయ్య వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహా ఆవిష్కరణ కోసం అదే రోజు వారి గ్రామానికి వెళ్తున్నానని తెలిపారు. సొంత ఇల్లు లేని ఏకైక ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య అని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా దామోదర సంజీవయ్య అందించిన సేవలు వెలకట్టలేనివని అన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హయాంలో బలహీన వర్గాల కోసం దామోదర సంజీవయ్య ఎనలేని కృషి చేశారని ఉద్ఘాటించారు. నెక్లెస్ రోడ్డులో ఉన్న సంజీవయ్య విగ్రహానికి నివాళులు అర్పించడానికి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, శ్రేణులు భారీగా హాజరుకావాలని హనుమంతురావు కోరారు.

## హైదరాబాద్-విజయవాడ మధ్య ఆరులైన్ల రహదారికి ప్రయత్నాలు!: కిషన్‌రెడ్డి



హైదరాబాద్: మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్ల నిర్మాణం వేగవంతమైందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గత పదేళ్లుగా జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ 33 జిల్లాల్లో 32 జిల్లాల నుంచి జాతీయ రహదారులు వెళ్తున్నట్లు చెప్పారు. “రోడ్లు అభివృద్ధి చెందినప్పుడే పెట్టుబడులు వస్తాయి. రహదారుల అనుసంధానం అన్నిటికంటే ముఖ్యమైనది. అందుకే వాజ్‌పేయీ హయాంలో ఎన్డీయే ప్రభుత్వం ‘స్వర్ణ చతుర్భుజి’ పథకాన్ని తీసుకొచ్చింది. 2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దానిని నిలిపివేసింది. రోడ్ల నిర్మాణంపై రూ.లక్షల కోట్లు ఎందుకని ఆనాడు విమర్శించారు. 2014లో తెలంగాణలో 2,500 కి.మీ మేర జాతీయ రహదారులు ఉండేవి. పదేళ్ల తర్వాత అవి 5,200 కిలోమీటర్లకు చేరుకున్నాయి. తెలంగాణలో రింగ్ రోడ్ల అభివృద్ధి జరుగుతోంది. అనుసంధానం కోసం మోదీ ప్రభుత్వం ఎక్కువ నిధులు ఖర్చు పెడుతోంది. పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్న అన్ని ప్రాంతాలకు రహదారులు నిర్మిస్తున్నాం. హైదరాబాద్-శ్రీశైలం మధ్య ప్రయాణ సమయం తగ్గించేలా రోడ్ల నిర్మాణం చేపడుతున్నాం. హైదరాబాద్-విజయవాడ మధ్య ఆరు లైన్ల రహదారికి యత్నిస్తున్నాం” అని కిషన్‌రెడ్డి తెలిపారు.



## తెలంగాణలో వర్షాలే వర్షాలు

హైదరాబాద్, మే 3: తెలంగాణలో వాతావరణం ఒక్కోసారి ఒక్కోలా మారిపోతుంది. అప్పటి వరకు వేడి గాలులు, ఎండవేడిమితో అల్లాడిపోతున్న ప్రజలకు సాయంత్రం కాగానే చల్లటి వాతావరణం ఉపశమనాన్ని ఇస్తోంది. అంతేకాకుండా ఉన్నట్టుండి వర్షాలు కూడా పడుతున్నాయి. ఉదయం ఎండగా ఉంటూ.. సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరమైన వాతావరణంతో ప్రజలకు ఊరట కలిగిస్తోంది. ఇదిలా ఉండగా.. తెలంగాణలో వర్షాలపై వాతావరణ శాఖ కీలక అప్డేట్ ఇచ్చింది. రాష్ట్రాన్ని భారీ వర్షాలు ముంచెత్తనున్నట్లు పేర్కొంది. ఏయే జిల్లాలో వర్షాలు పడనున్నాయో వెల్లడించింది. రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. రేపటి నుంచి మూడు వర్షాలు పడనున్నాయి. బంగాళాఖాతంలో ఉత్తర, దక్షిణ ద్రోణి ప్రభావంతో ఈ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉదయం పూట ఎండలు దంచికొట్టినప్పటికీ సాయంత్రం వేళల్లో వర్షాలు పడే అవకాశం ఉంది. గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయని.. ఈదురుగాలులతో కూడిన వర్షం పడనున్నట్లు వెదర్ రిపోర్ట్ చెబుతోంది. రాష్ట్రంలో ఏయే జిల్లాలో వర్షాలు పడతాయనే విషయాన్ని కూడా వాతావరణ వాఖ ప్రకటించింది. ముఖ్యంగా ఖమ్మం, మహబూబాబాద్ నల్లగొండ, వరంగల్, జనగాం, సూర్యాపేట, కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం ఎక్కువగా ఉంది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తమంగా ఉండగాలని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. మరోవైపు అకాల వర్షాలకు రైతులు అల్లాడిపోతున్నారు. ఇటీవల రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షం కురవగా.. పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి రాకముందే వర్షానికి దెబ్బతినడంతో రైతులు బాధ వర్ణణాతీతమనే చెప్పుకోవాలి. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో పాటు వడగళ్ల వర్షంతో పంటలకు అపారనష్టం వాటిల్లింది.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com